ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
ఆదివారం 14 జనవరి 2024

పండుగ శోభ

నేడే భోగ భాగ్యాల భోగి



వరంగల్ చౌరస్తాలో రేగుపండ్లను కొనుగోలు చేస్తున్న యువతులు

- పిల్లలకు భోగిపండ్లు పోసేందుకు రెడీ
- సంక్రాంతి, కనుమకు సన్నద్ధం
- రంగవల్లులతో లోగిళ్లు కళకళ
- గోదా కల్యాణాలకు ఏర్పాట్లు
- పండుగ సామగ్రి కొనుగోళ్లతో బజార్లు కిటకిట..
- ఇంటింటా పిండి వంటల ఘుఘుమలు
- పండుగకు సొంతూళ్లకు పయనం
- సందడి చేస్తున్న పతంగులు

వరంగల్ కలెక్టరేట్, జనవరి 13: సంక్రాంతి సంబరాలకు పల్లెలు, పట్టణాలు రెడీ అయ్యాయి. భోగి(ఆదివారం), సంక్రాంతి(సోమవారం), కనుమ(మంగళవారం) వేడుకలను ఘనంగా జరుపుకునేందుకు జిల్లా ప్రజలు సర్వం సిద్ధం చేసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో ఉన్నవారి సొంతూళ్లకు తిరిగిరావడంతో పల్లెలు, పట్టణాలు సందడి సందడిగా మారాయి. కాగా, పండగ సామగ్రి విక్రయాలతో వరంగల్‌లోని వివిధ ప్రాంతాలు, బస్టాండ్, రైల్వే స్టేషన్లు కిటకిటలాడాయి.

భోగికి సన్నద్ధం..

భోగ భాగ్యాలను ఇచ్చే భోగి పండుగ ఆదివారం ఘనంగా జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. సూర్యుడి సంక్రమనం జరిగే ముందుగా ధనుర్మాసం ముగింపు చేసి భోగి పండుగను మొదటి రోజుగా ఆచరించుకోవడం ఆనవాయితీగావస్తోంది. మకర సంక్రాంతి పండుగను మూడు రోజులపాటు నిర్వహించుకొనే ఆచారంలో భాగంగా తొలి రోజు భోగిని పండుగను జరుపుకుంటారు. తర్వాతి రోజు సంక్రాంతి, మర్నాడు కనుమ ఘనంగా జరుపుకుంటారు. భోగి రోజు తెల్లవారు జామున భోగి మంటలు వేస్తారు. చిన్నారులకు భోగి పండ్లు పోస్తారు. పిల్లలు ఆరోగ్యంగా ఉండాలని భోగిపండ్లని పోయడంసంప్రదాయంగా వస్తోంది. రైతులు తమ పంటలను ఇంటికి చేర్చిన తొలి ధాన్యాన్ని దేవుడికి నైవేద్యంగా పొంగలి ప్రసాదం చేయడంతో రైతుల పండుగగా సంక్రాంతి వేడుకగా పిలుస్తారు.

కనువిందు చేస్తున్న రంగవల్లులు

సంక్రాంతి అంటే మహిళలకు పెద్ద పండుగ. తమ ఇళ్ల ముందు అందమైన ముగ్గులు వేస్తారు. ముగ్గుల్లో ఆవుపేడతో గొబ్బెమ్మలను తయారు చేసి ముగ్గు మధ్యలో పెట్టి గొబ్బెమ్మలపై గరుక పెట్టి చుట్టూ నవధాన్యాలు పోయడం ఆనవాయితీ. సంక్రాంతి గొబ్బెమ్మ స్వాగతం అంటూ రంగవల్లులతో ప్రతీ లోగిలి పండుగ శోభను సంతరించుకుంటాయి.



పండుగ సామగ్రి కొనుగోలుతో వరంగల్ చౌరస్తా కిటకిట

ఆలయాల్లో గోదా కల్యాణాలకు ఏర్పాట్లు..

నెల రోజుల పాటు వైష్ణవ ఆలయాల్లో తిరుప్పావై ప్రవచనాలు ధనుర్మాసంలో కొనసాగాయి. భోగి పండుగ రోజున ధనుర్మాసం ముగింపుగా ఆండాళ్ దేవి, గోదాదేవి కల్యాణాలను వైష్ణవ ఆలయాల్లో అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నోములు.. బొమ్మల కొలువులు..

సంక్రాంతి పండుగ వచ్చిందంటే మహిళలు నోములు, బొమ్మల కొలువులు నిర్వహిస్తారు. తమ మాంగళ్యం చల్లగా ఉండాలని పసుపు కుంకుమలతో అమ్మవారిని 18 వస్తువులతో నోముకొని తాము నోముకున్న వస్తువులను ముత్తైదువులకు ప్రసాదాలతోపాటు తాము నోముకున్న వస్తువులను వాయినంగా ఇస్తారు. నోములకు వివిధ రకాల వస్తువులను 18 పెట్టి నోముతారు. ఇదిలా ఉండగా

మిగతా 8వ పేజీలో..



గాలిపటాల జోరు

సంక్రాంతి పండుగంటే గాలిపటాల సందడే. పండగ రోజున చినా, పెద్ద తాడా లేకండా ఉత్సాహంగా పతంగులను ఎగురవేయడం ఆనాదిగా వస్తున్న ఆచారం. దీంతో నగరంలో గాలిపటాల అమ్మకాలు జోరుగా సాగాయి. వివిధ రకాల రంగు రంగుల పతంగులు, మాంజా దారం, దారాన్ని చుట్టే చెరకుల అమ్మకాలు పెద్దఎత్తున వరంగల్‌లోని ఎల్లంబజార్, బట్టల బజార్, అండర్ బ్రిడ్జి, వరంగల్ చౌరస్తా, స్టేషన్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో గాలిపటాలను విక్రయించారు. వీటిని కొనుగోలు చేసేందుకు పిల్లలు, పెద్దలు ఎగబడ్డారు.

ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి, కలెక్టర్

రాష్ట్ర ప్రజలకు భోగి, సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్బంధ చీకట్లు తొలిగి, కొత్త కాంతులు ఇంటింటా వెల్లివిరియాలని ఆకాంక్షించారు. భోగ భాగ్యాల నందించే భోగి, కొత్త కాంతులు తెచ్చే సంక్రాంతి, కనుమ పండుగలు అందరు ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. అలాగే, జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలని కలెక్టర్ పి.ప్రావీణ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల జీవితాల్లో సంక్రాంతి పండుగ సుఖ సంతోషాలు నింపాలని ఆకాంక్షించారు. ప్రజలు సిరి సంపదలతో భోగ భాగ్యాలతో తులతూగాలని కోరారు.



రామప్ప పంప్‌హౌస్ మోటార్లను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

పాకాల ప్రాజెక్ట్ పరిశీలన

ఖానాపురం, జనవరి 13: రామప్ప-పాకాల ప్రాజెక్టుకు సంబంధించిన పైపులైన్, రామప్ప పంప్‌హౌస్ మోటార్లను శనివారం నీటిపారుదల శాఖ అధికారులతోపాటు కాంగ్రెస్ నాయకులు, పాకాల ఆయకట్టు రైతులు పరిశీలించారు. ములుగు జిల్లా రామప్ప నుంచి పాకాల సరస్సులోకి వచ్చే పైపులైన్ ఇటీవల పగిలిపోవడంతో మరమ్మతు చేపడుతుండగా ఆ పనులను శనివారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు ఆధ్వర్యంలో నీటి పారుదల శాఖ అధికారులు, పాకాల ఆయకట్టు రైతులు పరిశీలించారు. రామప్ప పంప్ హౌస్ నుంచి 3.5కిలోమీటర్ల వద్ద పగిలిన పైపులైన్ మరమ్మతు పనులను పరిశీలించారు. మరో నాలుగు రోజుల్లో మరమ్మతు పనులు పూర్తిచేయించి మోటార్లను నడిపించి పాకాలలోకి గోదావరి జలాలను అందిస్తామని ఐబీ డీఈ రమేష్ తెలిపారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు పగిలిన పైపులైన్ మరమ్మతు పనులు పరిశీలించడం జరిగిందని, ప్రత్యక్షంగా పరిశీలించిన పూర్తి సమాచారాన్ని ఎమ్మెల్యే మాధవరెడ్డి దృష్టికి తీసుకెళ్లి, రైతులకు సాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడనున్నట్లు తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు తెలిపారు. కార్యక్రమంలో నర్సంపేట మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ వేముల సాంబయ్యగౌడ్, జిల్లా నాయకుడు పరుచూరి రత్నాకర్ రావు, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఓర్సు తిరుపతి, ఎంపీటీసీ బిక్కి లింగమ్మ మురళి, వల్లే శ్రీనివాస్, చెడిపాక ఉపేందర్, మారబోయిన రాములు పాల్గొన్నారు.



వెల్తూరి పవన్



పోతుగంటి వంశీ

భవనానికి రంగులు వేయడానికి వచ్చి..

- బైక్‌పై వెళ్తుండగా అదుపు తప్పి చెట్టుకు ఢీ
- అక్కడికక్కడే ఇద్దరి మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు
- తాడ్వాయి మండలంలో ఘటన
- మృతులది శాయంపేట మండలం పత్తిపాక
- పనికి తీసుకెళ్లిన వ్యక్తి బాధ్యత వహించాలని గ్రామంలో ధర్నా

6

సల్లంగ సూడు మల్లన్న..

మొదలైన ఐనవోలు జాతర

కన్నుల పండువగా ధ్వజారోహణం

ఐనవోలు, జనవరి 13: చారిత్రక ఐనవోలులోని మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలు శనివారం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. స్వామివారికి ఒగ్గుపూజారులు మేలుకొలుపుచేయగా శైవాగమ పద్ధతిలో అర్చకులు విఘ్నేశ్వరపూజ రుద్రాభిషేకం నూతన వస్త్రాలంకరణ చేశారు. ఉదయం గణపతి పూజ, శైవశుద్ధి పుణ్యాహవచనం నిర్వహించారు. దేవతలను ఆలయంలోకి ఆహ్వానిస్తూ ఉత్సవ ప్రారంభసూచికగా కాషాయ ధ్వజ పతాకాలను చేపట్టారు. మంగళ వాయిద్యాలతో పరుషసూక్త మంత్ర పఠనంతో మూడుసార్లు ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి ఆలయ శిఖరం, క్షేత్రపాలకుడు ఆంజనేయ స్వామి గుడిపై ఎగురవేశారు. అనంతరం మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మహానివేదన నీరాజన మంత్రపుష్పం తీర్థప్రసాద వితరణ చేసి ఉత్సవాలు ప్రారంభమైనట్లు ప్రకటించారు. జాతర చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్‌గా ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్ ఎం.వీరస్వామిని నియమించారు. కాగా, ప్రముఖ శైవక్షేత్రమైన మల్లన్న స్వామి జాతరకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలివస్తున్నారు. ఆదివారం భోగి, సోమవారం మకర సంక్రాంతి రెండు పర్వదినాల్లో లక్షలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లిస్తారు. ఈ కార్యక్రమంలో ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు, ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, వేద పండితులు అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

నేడు భోగి పూజలు

భోగి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయంలో ఆదివారం ఉదయం స్వామివారికి ప్రాతఃకాలం మేలుకొలుపుతో పూజలు ప్రారంభమవుతాయి. విఘ్నేశ్వరపూజ పుణ్యాహవచనాలు, మహన్యాసపూర్వక ఏకాదశి రుద్రాభిషేకాలు, మంత్రపుష్పాలు, పూజలు జరుగునని ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు.



ఆలయ ప్రాంగణంలో విడిది చేసిన భక్తులు



మల్లన్న సన్నిధిలో భక్తజనం

ఐనవోలు మల్లికార్జునస్వామి సన్నిధికి భక్తుల రాక మొదలైంది. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలివస్తున్నారు. సాయంత్రం నుంచి సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులు విడిది చేస్తుండడంతో ఆలయ ప్రాంగణంలో సందడి నెలకొంది. నృత్యమండపం ఖాళీ స్థలం లేకుండా భక్తులు విడిదిచేశారు. రాత్రి పొద్దుపోయే వరకు భక్తుల రాక పెరుగుతూ పోయింది. ఆదివారం తెల్లవారేవరకు జాతర ప్రాంగణం, పరిసర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడనున్నాయి.

ఐనవోలుకు వచ్చే అన్ని ప్రధానదారులు భక్తుల వాహనాలతో రద్దీ అయ్యాయి. ఆర్టీసీ బస్సులు ప్రయాణికులను చేరవేస్తున్నాయి. వచ్చిన భక్తులు పట్నాలు, మొక్కులు తీర్చుకుంటూ స్వామివారిని దర్శించుకుంటున్నారు. ఢమురుకం, డోలు శబ్దాలతో ఆలయం ప్రాంగణం మారుమోగుతోంది. కాగా, జాతరలో ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు పలు స్టాళ్లను ప్రారంభించారు. వృద్ధులకోసం బ్యాటరీ కారు, ఆర్టీసీ బస్సుకు జెండా ఊపి ప్రారంభించారు..

విధుల్లో చేరిన అధికారులు

ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, మామునూరు ఏసీపీ సతీష్‌బాబు పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించి సీసీ టీవీల పనితీరు జాతర బందోబస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆర్డీవో రమేష్, డీపీవో జగదీశ్వర్, డీఎంహెచ్‌వో సాంబశివరావు జాతరలో ఏర్పాట్లను పరిశీలించారు. ఆర్‌డబ్ల్యుఎస్, ఎక్సైజ్, డబ్ల్యూజీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది జాతర విధుల్లో నిమగ్నమయ్యారు. పోలీసులు మాత్రం శుక్రవారం రోజునే విధుల్లో చేరగా మిగిలిన శాఖల అధికారులు శనివారం ఉదయం నుంచి విధులు షిఫ్టుల వారీగా నిర్వహిస్తున్నారు.



పీసీవోఎం నాగ్యాకు వినతిపత్రం అందజేత

డోర్నకల్‌లో మరిన్ని రైళ్లకు హాల్టింగ్‌లు

డోర్నకల్, జనవరి 13: డోర్నకల్ రైల్వే జంక్షన్‌లో త్వరలో మరికొన్ని సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించనున్నట్లు దక్షిణమధ్య రైల్వే ప్రిన్సిపుల్ చీఫ్ ఆపరేషన్ మేనేజర్ (పీసీవోఎం) నాగ్యా తెలిపారు. డోర్నకల్ రైల్వే స్టేషన్‌లో శనివారం ఆయన పర్యటించారు. ప్రత్యేక రైలులో వచ్చిన పీసీవోఎం స్టేషన్‌లోని 4వ నెంబర్ ప్లాట్‌ఫాం నుంచి కాలినడక వచ్చి బ్రిడ్జిపై నుంచి యార్డులును పరిశీలించారు. డీఆర్‌యూసీసీ మాజీ సభ్యుడు మైనూపాషా, ఖాదర్‌లు ఆయనకు పలు రైళ్లకు హాల్టింగ్ కల్పించాలని, కొవిడ్‌కు పూర్వం ఉన్న ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలని వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా పీసీవోఎం మాట్లాడుతూ డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో న్యూఢిల్లీ, చెన్నై, ముంబై వెళ్లేందుకు వీలుగా ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పిస్తామన్నారు. ప్రస్తుతం మూడోలైన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని, అవి పూర్తికాగానే నాల్గవ లైన్ నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని చెప్పారు.

నేటి నుంచి పుష్‌పుల్ రైలు ప్రారంభం

కాజీపేట-డోర్నకల్, డోర్నకల్- విజయవాడ, విజయవాడ-డోర్నకల్, డోర్నకల్-కాజీపేట మధ్య నడిచే పుష్‌పుల్ ప్యాసింజర్ ఆదివారం నుంచి పునరుద్ధరించనున్నట్లు రైల్వేశాఖ ఓ ప్రకటనలో తెలిపింది. డోర్నకల్‌కు వచ్చిన పీసీవోఎం నాగ్యా దృష్టికి ప్యాసింజర్ రైళ్ల రద్దువల్ల సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మాజీ డీఆర్‌యూసీసీ సభ్యులు తీసుకువచ్చారు. ఇందుకు స్పందించిన పీసీవోఎం ఆదివారం నుంచి పునరుద్ధరిస్తున్నట్లు చెప్పారు.



వనదేవతల గద్దెలను దర్శించుకుంటున్న భక్తులు

భక్తులతో సందడిగా మారిన మేడారం

- వనదేవతలకు మొక్కులు చెల్లించుకున్న భక్తులు



మేడారం, జనవరి 13: తాడ్వాయి మండలంలోని మేడారం వనదేవతలు సమ్మక్క-సారలమ్మలను దర్శించుకోవడానికి భక్తులు శనివారం భారీగా తరలివచ్చారు. వచ్చే ఫిబ్రవరి 21వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు ఆదివాసీ వనదేవతల మహా జాతర ఘనంగా జరగనుంది. ఈ నేపథ్యంలో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు కుటుంబ సమేతంగా మేడారం చేరుకొని తల్లుల గద్దెలకు ముందస్తు మొక్కులు చెల్లించుకుంటున్నారు. భక్తులు ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టల్లో తలనీలాలు సమర్పించారు. అనంతరం సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలను దర్శించుకున్నారు. పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, చీరె, సారె, కొబ్బరికాయలు, బెల్లం(బంగారం) సమర్పించుకుని పూజలు చేశారు. చల్లగా చూడాలని మొక్కుకున్నారు. సుమారు 20వేలకు పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని మేడారం ఎగ్జిక్యూటివ్ అధికారి రాజేంద్రం తెలిపారు.



ఆగిన షో

నెల రోజులుగా పనిచేయని లైట్ అండ్ సౌండ్ షో

'కోట'లో తరచూ సాంకేతిక లోపాలు..

నిరాశతో వెనుదిరుగుతున్న పర్యాటకులు, సందర్శకులు

ఖిలావరంగల్, జనవరి 13: ఖిలావరంగల్‌లోని పర్యాటక ప్రాంతంపై అధికారుల నిర్లక్ష్యంపై పర్యాటకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాకతీయుల శిల్ప సంపద, కళాఖండాలు, దేవాలయాలు, రాతి, మట్టికోటలు వివిధ కట్టడాలు, ముందుతరాలకు తెలియజేసేందుకు మధ్యకోటలో లైట్ అండ్ సౌండ్ షో (కాకతీయుల చిత్ర ప్రదర్శన)ను ఏర్పాటు చేశారు. సాంకేతిక లోపంతో నెల రోజులుగా షో వేయడం లేదు. గతనెల(డిసెంబరు 31), మర్నాడు న్యూఇయర్ వేడుకలకు పెద్ద సంఖ్యలో పర్యాటకులు రాగా లైట్ అండ్ సౌండ్ షో లేదని తెలిసి ఉసూరుమంటూ వెనుదిరిగారు. ఇప్పుడు సంక్రాంతి సెలవులు రావడంతో పర్యాటకులు, విద్యార్థులు వస్తున్నా.. అధికారులు మాత్రం మరమ్మతులు చేపట్టడం లేదని పర్యాటకులు మండిపడుతున్నారు.

తరచూ సాంకేతిక సమస్యలు..

మధ్యకోటలో 2013 డిసెంబరులో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.6కోట్లతో కాకతీయుల కళాఖండాలు, శిల్పసంపద, దేవాలయాలు, వివిధ కట్టడాలు, వారి చరిత్రను గంట నిడివితో ప్రదర్శించేందుకు లైట్ అండ్ సౌండ్ షోను అందుబాటులోకి తెచ్చింది. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నాటి మంత్రి బస్వరాజ్ సారయ్య డిసెంబరు, 2013లో దీన్ని ప్రారంభించారు. కోటలో లైట్ అండ్ సౌండ్ షోకు సంబంధించిన కేబుల్స్, సౌండ్ బాక్స్‌లు, లైట్స్, స్క్రీన్స్ ఎండకు ఎండి, వానకు తడిసి పోవడంతో నాటి చిత్రాలు సరిగా కనిపించడం లేదని సందర్శకులు వాపోతున్నారు. కేంద్ర పురావస్తు శాఖ ఆధీనంలో లైట్ అండ్ సౌండ్ షో కొనసాగుతోంది. రెండేళ్ల క్రితం భారీ వర్షానికి శిల్పాల మధ్యన గల స్క్రీన్, సౌండ్ బాక్స్‌లు, లైట్స్ రెండు నెలలపాటు నీటిలోనే ఉండి పోయాయి. దీంతో షోలు నిలిచిపోగా, మరమ్మతులు చేసి షోను పునరుద్ధరించారు. సాంకేతిక లోపంతో తరచూ షోకు అవాంతరాలు ఏర్పడుతుండడంతో దేశవిదేశాల నుంచి వచ్చే పర్యాటకులు షో ను తిలకించలేక పోతు న్నారు. తాజాగా, నెలరోజులుగా షో నడకున్నా, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలని పర్యాటకులు కోరుతున్నారు.

త్వరలో షోను ప్రారంభిస్తాం

సమస్యల్ని అధిగమించి త్వరలోనే లైట్ అండ్ సౌండ్ షోను పునరుద్ధరిస్తామని టీఎస్‌టీడీసీ ఉన్నతాధికారులు తెలిపారు. కొన్ని సాంకేతిక కారణాల దృష్ట్యా పని చేయడం లేదని పేర్కొన్నారు. కావాల్సిన పరికరాలను సమకూర్చడానికి సంస్థ ఉన్నతాధికారులకు తెలియజేయడం జరిగిందని, త్వరలో పరికరాలను తీసుకువచ్చి షోలను అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నారు.




తుప్పు పట్టిన నేలపై ఉన్న సౌండ్ బాక్స్




లైట్ అండ్ సౌండ్ షో స్క్రీన్












సంఘటనా స్థలిలో వంశీ, పవన్ మృతదేహాలు

భవనానికి రంగులు వేయడానికి వచ్చి..

- బైక్‌పై వెళ్తుండగా అదుపుతప్పి చెట్టుకు ఢీ
- అక్కడికక్కడే ఇద్దరి మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు



పత్తిపాకలో సుధాకర్ ఇంటి ఎదుట మృతదేహాలతో బంధువుల ఆందోళన

తాడ్వాయి/శాయంపేట, జనవరి 13: జనవరి 13: పీఏసీఎస్ నూతన భవనానికి రంగులు వేయడానికి వచ్చిన వారిలో ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఇందులో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని నాంపల్లి బంజర గ్రామ శివారులో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే...

హనుమకొండ జిల్లా శాయంపేట మండలం పత్తిపాక గ్రామానికి చెందిన పోతుగంటి వెంకటేశ్వర్లు-వనితల కుమారుడు వంశీ(23), ఎల్తూరి మొగిలి-జయలక్ష్మిల కుమారుడు పవన్(22), మామిడి కుమారస్వామి - అన్నపూర్ణల కుమారుడు భాస్కర్(30)లు తాడ్వాయి మండల కేంద్రంలోని పీఏసీఎస్ నూతన భవనానికి రంగులు వేయడానికి వచ్చి పనులు చేపడుతున్నారు. అక్కడ పని ముగిశాక కాటాపూర్‌లోని పీఏసీఎస్ గిడ్డంగి భవనానికి కూడా రంగులు వేసి శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనంపై తిరిగి తాడ్వాయికి వస్తున్నారు. ఈ క్రమంలో నాంపల్లి బంజర మూలమలుపు వద్దకు చేరుకోగానే వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొంది. దీంతో వంశీ, పవన్‌లు రోడ్డుకు పది మీటర్ల దూరంలో ఎగిరిపడి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. మామిడి భాస్కర్‌కు తీవ్రగాయాలు కావడంతో 108 వాహనంలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. శనివారం ఉదయం కాటాపూర్ వెళ్లే వాహనదారులు వారిని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని మృతుల కుటుంబాలకు సమాచారం అందించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ములుగు ఏరియా వైద్యశాలకు తరలించారు. కాగా, మృతుల తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వివరించారు. కాగా, వీరందరూ అవివాహితులని తెలిపారు.

పత్తిపాకలో ఉద్రిక్తత

ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుల కుటుంబాలకు న్యాయం చేయాలని బంధువులు, మద్దతుదారులు మృతదేహాలతో ఆందోళనకు దిగారు. శాయంపేట మండలం పత్తిపాక గ్రామానికి చెందిన పోతుగంటి సుధాకర్.. వెల్తూరి పవన్(22), పోతుగంటి వంశీ(23), మామిడి భాస్కర్‌లను ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని పీఏసీఎస్ భవనాలకు రంగులు వేయించడానికి తీసుకెళ్లారని, దీనికి యువకుల మృతికి పోతుగంటి సుధాకర్ బాధ్యత వహించి మృతుల కుటుంబాలకు తగిన న్యాయం చేయాలని శనివారం మృతదేహాలను సుధాకర్ ఇంటి వద్ద వేసి ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో గ్రామంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మూడుగంటల ఉద్రిక్తతల నడుమ సీఐ మల్లేష్‌తోపాటు శాయంపేట, ఆత్మకూరు, దామెర, పరకాల ఎస్సైలు మృతుల బంధువులను సముదాయించారు. సుధాకర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుని బాధిత కుటుంబాలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో మృతదేహాలను తీసుకుని వెళ్లారు. అనంతరం మృతదేహాల వాహనాన్ని గ్రామంలోని ప్రధానరోడ్డుపై నిలిపి సుధాకర్‌ను తీసుకొచ్చేవరకు మృతదేహాలను తీసుకెళ్లేది లేదని రోడ్డుపై ఆందోళనకు దిగారు. దీంతో మళ్లీ పోలీసులు ప్రవేశించి కుటుంబ సభ్యులు, బంధువులు, మద్దతుదారులకు నచ్చజెప్పి మృతదేహాలను తరలించారు. మృతి చెందిన యువకులను పనికి తీసుకెళ్లిన సుధాకర్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.





భార్య ఆత్మహత్య..? భర్త హత్య..?

- అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి
- ఆమె బంధువుల దాడి.. చనిపోయిన భర్త
- అచ్చంపేటలో దారుణం.. ఇరు కుటుంబాల్లో విషాదం


సింధు, నాగార్జున (ఫైల్)

అచ్చంపేట, జనవరి 13 : అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత చనిపోయింది. కుటుంబ కలహాలు, వరకట్నం, లైంగిక వేధింపుల ఆరోపణలు ఆమె మరణం చుట్టూ అలుముకున్నాయి. కట్టుకున్నోడి వల్లనే తమ బిడ్డ చనిపోయిందని ఆగ్రహించిన యువతి బంధువులు ఆమె భర్తపై దాడి చేశారు. దెబ్బల తీవ్రతనో.. మరే కారణమో తెలియదు కానీ.. అతడు చనిపోయాడు. దీంతో ఇరు కుటుంబాల్లో విషాదం నిండింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు చెందిన సింధు(26)కు పట్టణంలోని శ్రీరాం(సరిరాం) ఆస్పత్రిలో పని చేస్తున్న ఖమ్మం జిల్లాకు చెందిన నాగార్జునతో పరిచయం ఏర్పడి, ప్రేమగా మారింది. మూడేళ్ల క్రితం వీరు హైదరాబాద్‌లోని ఆర్య సమాజ్‌లో పెళ్లి చేసుకున్నారు. కొంత కాలం అక్కడే ఉండి తర్వాత అచ్చంపేటకు వచ్చి శ్రీరాం ఆస్పత్రిలో పని చేస్తున్నారు. ఏడాది క్రితం దంపతుల మధ్య గొడవలు జరగడంతో సింధు.. బిజినేపల్లిలోని అమ్మమ్మ గారి ఇంటికి వెళ్లిపోయింది. నాగార్జున పోలీసులను ఆశ్రయించడంతో ఆమె తిరిగి వచ్చింది. ఆర్థిక పరిస్థితులు బాగాలేకపోవడం, డబ్బు కోసం భర్త వేధింపుల నేపథ్యంలో ఇరువురి మధ్య మళ్లీ గొడవలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి సింధు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. కొన ఊపిరితో ఉన్న ఆమెకు భర్త నాగార్జున.. శ్రీరాం ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలిస్తుండగా సింధు చనిపోయింది. ఈ విషయాన్ని నాగార్జున.. సింధు కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతో ఆమె బంధువులు ఒక వాహనంలో అంబులెన్స్ వద్దకు చేరుకున్నారు. నాగార్జునను తమ వాహనంలో ఎక్కించుకొని తీవ్రంగా దాడి చేశారు. దెబ్బల తీవ్రతనో.. మరే కారణమో తెలియదు గానీ.. నాగార్జున చనిపోయాడు. అతడిని కొట్టి చంపేశారని నాగార్జున తల్లి, చెల్లెలు ఆరోపిస్తున్నారు. కాగా, తమ కూతురిని చంపి, ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని సింధు తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. నాగార్జున, డాక్టర్ కృష్ణ, అతడి భార్య హైమావతి ఇదంతా చేశారని చెప్పారు. డాక్టర్ కృష్ణ తమ కూతురిని పలుమార్లు లైంగికంగా వేధించాడని తెలిపారు. నాగార్జున మృతిపై అతడి కుటుంబీకులు కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నీటి బకెట్‌లో పడి చిన్నారి మృతి

కొత్తూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఓ 16 నెలల చిన్నారి ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు నీటి బకెట్‌లో పడి మృతిచెందింది. ఈ విషాదకర ఘటన రంగారెడ్డి జిల్లా కొత్తూర్‌లో శనివారం జరిగింది. బిహార్‌కు చెందిన ధర్మేందర్ దంపతులు కొత్తూర్ నారాయణగూడ కాలనీలో నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్న ధర్మేందర్ శనివారం పనికి వెళ్లాడు. అతని భార్య ఇంటి పనుల్లో నిమగ్నమై ఉండగా పెద్ద కుమార్తె రుయా (16 నెలల) ఆడుకుంటూ వెళ్లి బాత్‌రూంలోని నీటి బకెట్‌లో పడిపోయింది. నీటి బకెట్‌లో చిన్నారి మృతి చెంది కనిపించడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

అప్పులు తీర్చలేక యువ రైతు ఆత్మహత్య

ఖానాపూర్, జనవరి 13 : పత్తి పంట దిగుబడి రాకపోవడం, అప్పులు పెరిగిపోవడంతో జీవితంపై విరక్తి చెందిన ఓ యువ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం చందునాయక్ తండాకు చెందిన గుగ్లావత్ శ్రీకాంత్ (26) రెండు ఎకరాల్లో పత్తి వేశాడు. ఈ సారి ఆశించినంత దిగుబడి రాలేదు. దీనికి తోడు తన అక్క పెళ్లి కోసం చేసిన రూ.3 లక్షల అప్పు ఎలా తీర్చాలో తెలియక నిత్యం మథన పడేవాడు. ఈ క్రమంలోనే శనివారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

బస్సు మంటల్లో మసైపోయి..

గద్వాల జిల్లా బీచుపల్లి వద్ద ప్రైవేటు బస్సు బోల్తా.. చెలరేగిన మంటలు.. మహిళ సజీవ దహనం


మంటల్లో పూర్తిగా కాలిపోయిన బస్సు, ఇన్‌సెట్లో... మాలతి(ఫైల్)

గద్వాల, గద్వాల క్రైం /ఎర్రవల్లి, నార్సింగ్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): బోల్తాపడ్డ ఆ బస్సుకు అంటుకున్న మంటలు పెద్దవి కాకమునుపే ప్రయాణికుల్లో కొందరు ఎలాగో అలా బయటపడ్డారు. చాలామందిని స్థానికులే రక్షించారు. ఒక్క మహిళ మాత్రం ఆ బస్సులోనే ఉండిపోయింది. రాకాసి మంటలు కోరలు చాస్తూ బస్సు అంతటా వ్యాపించాయి. ఆ మంటల్లో ఆమె కాలిబూడిదై పోయింది. ఈ హృదయవిదారక ఘటన గద్వాల జిల్లాలో జరిగింది. హైదరాబాద్ నుంచి చిత్తూరు వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు శనివారం తెల్లవారుజామున బీచుపల్లి-ఎర్రవల్లి మధ్య బోల్తా పడింది. ఆ వెంటనే బస్సు ముందు భాగంలో మంటలంటుకున్నాయి. మృతురాలిని ఏపీలోని చిత్తూరు జిల్లాకు చెందిన మాలతి (45)గా గుర్తించారు. పోలీసుల వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి 11 గంటలకు ఓ ప్రైవేటు బస్సు హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి నుంచి చిత్తూరుకు బయలుదేరింది. బస్సుల్లో 42 మంది ప్రయాణికులు, ఇద్దరు డ్రైవర్లు ఉన్నారు. హైదరాబాద్ నుంచి జడ్చర్ల దాబా దాకా ఒక డ్రైవర్ బస్సు నడిపాడు. తర్వాత ఒంటి గంట సమయంలో స్టీరింగ్ రెండో డ్రైవర్ తీసుకున్నాడు. బీచుపల్లి దాటిన తర్వాత, పదవ బెటాలియన్ సమీపంలో తెల్లవారుజామున 2.30 గంటలకు బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ప్రయాణికులు ప్రాణభయంతో కేకలు వేశారు. పక్కనే ఉన్న హార్వెస్టర్ గ్యారేజీ కార్మికులు, పెట్రోల్ బంక్ వర్కర్లు హుటాహుటిన స్పందించారు. బస్సు అద్దాలను పగులగొట్టి ప్రయాణికులను కాపాడారు. పోలీసులు కూడా సహాయక చర్యలు చేపట్టారు.ఆ వెంటనే బస్సులో మంటలు చెలరేగాయి. మంటల్లో మాలతి అనే ప్రయాణికురాలు చిక్కుకుపోయారు. ఆమె చెయ్యి బస్సు సీటు సందులో ఇరుక్కుపోవడంతో తప్పించుకునేందుకు వీల్లేకపోయినట్లు తెలుస్తోంది. కాపాడండి అంటూ ఆమె ఆర్తనాదాలు చేస్తున్నా, అప్పటికే మంటలు తీవ్రం కావడంతో ఎవరూ ఆమెను రక్షించే సాహసం చేయలేకపోయారు. అందరి కళ్ల ముందే ఆమె సజీవ దహనమయ్యారు. మాలతిది చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం, పుత్తమర్ల గ్రామం. ఆమె హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని రైస్ రీసెర్చ్ సెంటర్‌లో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నారు. భర్త శ్రీనివాస్ కూడా హైదరాబాద్‌లోనే వ్యాపారం చేస్తుండటంతో ఆ కుటుంబం నగరంలోని లంగర్‌హౌజ్‌లో ఉంటోంది. భర్త శ్రీనివాస్ తల్లి అనారోగ్యానికి గురవ్వడంతో రెండ్రోజుల క్రితం ఆమె చిత్తూరుకు వెళ్లిపోయారు. మాలతి కూడా శుక్రవారం రాత్రి బస్సులో సొంతూరుకు ప్రయాణమయ్యారు. తెల్లవారుజామున మూడు గంటల సమయంలో ఘటన జరగ్గా, ఉదయం ఏడు గంటల దాకా మాలతి మృతదేహం కాలుతూనే ఉంది.. తన కళ్ల ముందే మాలతి మంటల్లో సజీవదహనమైందని గద్వాల వాస్తవ్యుడు కలీం అనే ప్రత్యక్ష సాక్షి చెప్పారు. హైదరాబాద్ నుంచి ఊరికి వెళుతుండగా బస్సుకు మంటలంటుకోవడాన్ని గమనించి అక్కడికి వెళ్లాలని ఆయన చెప్పారు. కాగా డ్రైవర్ నిద్రమత్తే బస్సు ప్రమాదానికి కారణం అని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. 36 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఆరుగురు ప్రయాణికులు, ఒక డ్రైవర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఘటన స్థలంలోనే మాలతి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. గద్వాల, అలంపూర్ ఎమ్మెల్యేలు కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు ఘటనాస్థలికి వెళ్లారు.

గతంలోనూ ఇదే తరహా ఘటనలు

ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలో గతంలోనూ ఇలాంటి ప్రమాదాలు జరిగాయి. 2002 సెప్టెంబరు 5న గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం కోదండాపురం వద్ద హైదరాబాద్ నుంచి కడప జిల్లా రాయచోటికి వెళ్తున్న ఆర్టీసీ బస్సులో మంటలు చెలరేగాయి. ఈ బస్సులో ప్రయాణిస్తున్న 31 మందిలో 13 మంది చనిపోయారు. మరో 18 మందికి తీవ్రగాయాలయ్యాయి. 2013 అక్టోబరు 30న బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న జబ్బార్ ట్రావెల్స్‌కు చెందిన వాల్వో బస్సు కొత్తకోట మండలం పాలెం వద్ద కల్వర్టుకు ఢీకొని రాసుకపోవడంతో మంటలు చెలరేగి బస్సుకు మంటలంటుకున్నాయి.. ఈ ఘోర దుర్ఘటనలో 45 మంది సజీవదహనం అయ్యారు.

గుంతలోకి 3 వాహనాలు.. తల్లి, కొడుకు దుర్మరణం!

- ముందు వెళుతున్న ఆటోను ఢీకొట్టిన కారు
- అదుపుతప్పి ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొన్న ఆటో
- 3 వాహనాలూ గుంతలోకి.. కారులోని తల్లి, కుమారుడి మృతి

శంషాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఒక వాహనం అదుపు తప్పడం.. ఆ వాహనంతో పాటు మరో రెండు వాహనాలను ప్రమాదం బారిన పడేసింది! మూడు వాహనాలూ రోడ్డు పక్కన ఓ గుంతలో పడ్డాయి. ప్రమాదానికి గురైనవి కారు, ఆటో, బైక్! ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న తల్లి, కొడుకు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. ఆటోలో ప్రయాణిస్తున్న వారిలో ఒకరు, బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు గాయపడ్డారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ఘాంసిమియాగూడ వద్ద ఈ ప్రమాదం సంభవించింది. శంషాబాద్ రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. కాప్రా మునిసిపాలిటీ శ్రీరాంనగర్‌కు చెందిన బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ సైంటిఫిక్ ఆఫీసర్ మెరువ ఆదిశేషారెడ్డి(57), తల్లి రాములమ్మ(88)తో కలసి కారులో హైదరాబాద్ నుంచి నంద్యాలకు వెళుతున్నారు. ఘాంసిమియాగూడ వద్దకు రాగానే కారు అదుపుతప్పి ముందు వెళుతున్న ఆటోను ఢీకొట్టింది. ఫలితంగా ఆటో అదుపుతప్పి దాని ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొంది. ఫలితంగా మూడు వాహనాలు ఒకదాని వెంట మరొకటి హైదరాబాద్-బెంగుళూరు జాతీయ రహదారి విస్తరణ పనుల కోసం నిర్మించిన కల్వర్టులో బోల్తాపడ్డాయి. ప్రమాదంలో కారులో ఉన్న ఆదిశేషారెడ్డి, రాములమ్మ అక్కడికక్కడే మృతిచెందారు. బైక్‌పై ఉన్న గొల్ల ఆంజనేయులు, వెనుక కూర్చున్న పద్నాలుగేళ్ల బాలిక, ఆటోడ్రైవర్ రాయన్నగూడ సిద్ధయ్య గాయపడ్డారు. ఆటోలో ఉన్న మరో ఇద్దరు రోడ్డుపక్కనే పడిపోగా వారికి ఎలాంటి గాయాలు కాలేదు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని తల్లీకుమారుల మృతదేహాలను కల్వర్టు నీటిలో నుంచి బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

పండుగ సరుకుల కోసం వచ్చి..

పరలోకాలకు!

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

చేర్యాల, జనవరి 13: సంక్రాంతి పండుగకు సరుకులు కొనేందుకు బయటికి వచ్చిన మహిళ రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. కాటర్‌పిల్లర్ మెషీన్ ఆపరేటర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడంతోనే ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం దొమ్మాట గ్రామానికి చెందిన చల్లా లక్ష్మి(39) శనివారం చేర్యాలకు పండుగ కోసం సరుకులు కొనేందుకు వచ్చింది. తర్వాత ఇంటికి వెళ్లేందుకు చూస్తుండగా తమ ఇంటి సమీపంలోని బంధువు కనకారెడ్డి కలిసి టీవీఎస్ ఎక్సెల్‌పై దొమ్మాటకు వెళ్తూ ఎక్కించుకున్నాడు. ఇటు జనగామ-సిద్దిపేట ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పట్టణ శివారులో కల్వర్టు నిర్మాణం జరుగుతోంది. అక్కడ చెవులకు ఇయర్ ఫోన్స్ పెట్టుకొని కాటర్ పిల్లర్ మెషీన్‌తో ఆపరేటర్ నిర్లక్ష్యంగా కంకర మిశ్రమాన్ని చదును చేస్తూ వెనక వైపునకు తోలుతున్నాడు. ఇంతలో వెనక నుంచి వస్తున్న కనకారెడ్డి బండి అదుపు తప్పడంతో ఇద్దరూ కిందపడిపోయారు. అది గమనించని ఆపరేటర్ మెషీన్‌ను లక్ష్మి పైనుంచి తీయడంతో ఆమె మృతి చెందింది. కనకారెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. కాగా, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని మృతురాలి కుటుంబీకులు, బంధువులు చేర్యాల పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. జనగామ-సిద్దిపేట రహదారిపై బైఠాయించారు.

పతంగి ఎగురవేస్తుండగా

విద్యుత్తు షాక్

- అత్తాపూర్‌లో 11 ఏళ్ల బాలుడి దుర్మరణం
- రైలు పట్టాలపై పడిన గాలి పటం
- నవాంద్గీ స్టేషన్‌లో రైలు ఢీకొని బాలుడి మృతి

రాజేంద్రనగర్/బషీరాబాద్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): భవనంపై ఉన్న ఏసీ కాపర్ పైప్‌లైన్‌ను విద్యుత్ ప్రసారం జరిగి.. కరెంటు షాక్‌తో ఓ బాలుడు చనిపోయాడు. రాజేంద్రనగర్‌లో ఈ ఘోరం జరిగింది. అత్తాపూర్ రాంబాగ్ మల్లయ్య టవర్స్ సమీపంలో మహారాష్ట్రకు చెందిన అభిషేక్ కుటుంబం ఉంటోంది. అభిషేక్ సోదరుడు మూడేళ్ల క్రితం చనిపోయాడు. అభిషేక్ వదిన చాలారోజుల క్రితం ఎటో వెళ్లిపోయింది. దీంతో వారి కుమారుడు తనిష్క్(11) పెదనాన్న అభిషేక్ వద్దే ఉంటున్నాడు. సంక్రాంతి సందర్భంగా అభిషేక్ కుమారుడు మోహిత్ పతంగి ఎగురవేసేందుకు మల్లయ్య టవర్స్ ముందు ఉన్న లక్ష్మీవాణి టవర్స్ పైకి వెళ్లాడు. అతడితో తనిష్క్ కూడా వెళ్లాడు. లక్ష్మీవాణి అపార్ట్‌మెంట్స్ పెంట్‌హౌస్‌పై ఇద్దరూ పతంగి ఎగురవేస్తుండగా అక్కడ ఏసీ ఔట్‌పుట్ కాపర్ పైప్‌లైన్‌కు తనిష్క్ తగిలాడు. దానికి అప్పటికే విద్యుత్తు ప్రసారం జరగడంతో షాక్‌తో చనిపోయాడు. గాలిపటం కోసం పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని బాలుడు చనిపోయాడు. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం నవాంద్గీ రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం ఈ ప్రమాదం జరిగింది. బషీరాబాద్ మైనారిటీ కాలనీకి చెందిన అస్లామ్ కుమారుడు అబుజార్(9) గాలి పటం ఎగరేస్తున్నాడు. అది తెగి ఇంటి సమీపంలోనే ఉన్న రైలు పట్టాలపై పడటంతో పతంగి తీసుకునేందుకు బాలుడు పరుగు తీశాడు. అప్పటికే స్టేషన్‌లో గూడ్స్ రైలు ఆగి ఉండటంతో దాని కింది నుంచి దూరి అటువైపు వెళ్తుండగా మరో ట్రాక్‌పై వస్తున్న రైలు ఢీకొట్టింది.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

మహిళలకు ధ్యానం ఎంతో అవసరం : మహబూబాబాద్ జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ సుంకరనేని నాగవాణి



బహుమతులు పొందిన మహిళలతో సుంకరనేని నాగవాణి

చిన్నగూడూరు (మహబూబాబాద్ జిల్లా), జనవరి 13: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని మహబూబాబాద్ జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ సుంకరనేని నాగవాణి అన్నారు. శనివారం చిన్నగూడూరు మండలంలోని జయ్యారం గ్రామంలో 'హార్ట్‌ఫుల్ నెస్ ఆధ్యాత్మిక ధ్యాన శిక్షణ సంస్థ' జయ్యారం ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో 200 మంది ఉత్సాహవంతమైన మహిళలు పాల్గొన్నారు. దీంతో జయ్యారంలో సంక్రాంతి సందడి వాతావరణం ఒకరోజు ముందే నెలకొంది. విజేతలతో పాటు ముగ్గుల పోటీలో పాల్గొన్న ప్రతీ ఒక్కరికి హార్ట్ ఫుల్ నెస్ ధ్యాన శిక్షణ సంస్థ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సుంకరనేని నాగవాణి మాట్లాడుతూ.. పనిఒత్తిడితో కూడుకున్న నేటి మహిళలకు ధ్యానం ఎంతో అవసరమని అన్నారు. ధ్యానం చేయడం ద్వారా సమాజ అభివృద్ధి త్వరితగతిన జరుగుతుందని, హార్ట్ ఫుల్‌నెస్ సంస్థ నిస్వార్థంగా, శాస్త్రీయ పద్ధతిలో ఉచితంగా అందించే ధ్యానంను ప్రతీ ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు. ధ్యానంతో ధైర్యంగా త్వరితగతిన నిర్ణయాలు జరిగి, మహిళలు అన్నిరంగాల్లో ముందుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పద్మ వెంకట్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ రాధ ముత్తయ్య, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు మురళీకృష్ణ, శిక్షకులు నరేందర్, వెంకటయ్య, విజయ, జనార్ధనాచారి, కేశవరావు, కవిత, జగన్నాథరెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

'చలో మేడారం' ఫోక్ సాంగ్ చిత్రీకరణ


షూటింగ్‌లో డ్యాన్స్ వేస్తున్న కళాకారులు

మేడారం, జనవరి 13: తాడ్వాయి మండలం మేడారంలో సమ్మక్క, సారలమ్మ ఫోక్ హంగామా ప్రొడక్షన్ ఆధ్వర్యంలో 'చలో మేడారం' సాంగ్ చిత్రీకరణను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మాత డాక్టర్ కిన్నెర స్వాతి మాట్లాడుతూ.. వనదేవతలకు మొక్కులో భాగంగా ఈ చిత్రాన్ని మేడారంలో పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు సమక్షంలో తల్లుల ప్రధాన గేటు ముందు ఐల్యాండ్ వద్ద ప్రారంభించామన్నారు. సాంగ్ ప్రారంభంలో పూజారుల పరిచయం ఉంటుందని తెలిపారు. ఈ చిత్రం మూడు రోజులు మేడారంలో జంపన్నవాగు, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాల్లో రూపొందించనున్నట్లు తెలిపారు. చిత్రం ద్వారా 900 మందికి ఉపాధి కల్పిస్తున్నామని, పూర్తి చేయడానికి రూ.22లక్షల ఖర్చు అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు జాన్ రఘు, సంగీత దర్శకుడు ఎస్కే బాజీ, సిబ్బంది, కళాకారులు, సినీ బృందం పాల్గొన్నారు.

వ్యవసాయ పంపు సెట్లకు జియో టాగింగ్ లేదు

నయీంనగర్, జనవరి 13: ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని వ్యవసాయ పంపుసెట్లకు జియో ట్యాగింగ్ చేయడం లేదని టీఎస్ఎన్ పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి స్పష్టం చేశారు. హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్‌భవన్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో సీఎండీ వరుణ్‌రెడ్డి మాట్లాడారు. 2021వ సంవత్సరంలో డీటీఆర్ (డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్స్)లను 11 కేవీ ఫీడర్ లైన్ల మ్యాపింగ్ కోసం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. శుక్రవారం ఒక పత్రికలో 'వ్యవసాయానికి జియో ట్యాగింగ్ ' అని ప్రచురితమైన, వాట్సాప్‌లో వైరల్ అవుతున్న వార్త పూర్తిగా తప్పుడు వార్త అని, అవాస్తవమని సీఎండీ వరుణ్‌రెడ్డి తెలిపారు.

మొండ్రాయి యువకుడు జియో సైంటిస్ట్‌గా ఎంపిక


శ్రీకాంత్

సంగెం, జనవరి 13: మండలంలోని మొండ్రాయి గ్రామానికి చెందిన రైతు బిడ్డ సింగిరెడ్డి శ్రీకాంత్ జియో సైంటిస్టుగా(గెజిటెడ్ అధికారిగా) ఎంపికయ్యారు. శుక్రవారం వెలువడిన యూపీఎస్సీ (యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్) గ్రూపు-ఎ ఫలితాల్లో శ్రీకాంత్ 113వ ర్యాంక్ సాధించారు. ప్రిలిమరీ పరీక్ష(హాల్‌టికెట్ నంబరు 1090478) గత యేడాది ఫిబ్రవరి 18న, మెయిన్స్ జూన్ 25, 26 తేదీల్లో రాశారు. గత డిసెంబరు 5న ఢిల్లీలో ఇంటర్వ్యూకు హాజరయ్యారు. కాగా, ఈనెల 12న ఫలితాలు విడుదల కాగా, శ్రీకాంత్ 113వ ర్యాంకు సాధించారు. పదో తరగతి వరకు గ్రామంలో, ఇంటర్ నర్సంపేటలో పూర్తి చేశారు. డిగ్రీ హనుమకొండలో, ఎమ్మెస్సీ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేశారు.

శ్రీకాంత్ జియో సైంటిస్టుగా ఎంపిక కావడంతో గ్రామంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. శ్రీకాంత్ తండ్రి సింగిరెడ్డి కుమారస్వామి తనకున్న మూడెకరాల వ్యవసాయ భూమిలో పంటలు పండిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. తల్లి, తండ్రి అందించిన ప్రోత్సాహంతో చదువులో ముందంజలో నిలుస్తూ ప్రభుత్వ ఉద్యోగాల కోసం శ్రమించారు. తండ్రికి వ్యవసాయంలో సహకారం అందిస్తునే యూపీఎస్సీ పరీక్షలకు హాజరయ్యారు. కాగా, శ్రీకాంత్‌ను పలువురు అభినందించారు.

సమాచార హక్కు పరిరక్షణ సమితి కోఆర్డినేటర్‌గా మధు



హనుమకొండ రూరల్, జనవరి 13: జాతీయ సమాచార హక్కు పరిరక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా కో ఆర్డినేటర్‌గా హనుమకొండకు చెందిన సీనియర్ జర్నలిస్టు గాడిపల్లి మధును ఎంపిక చేశారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ కన్నెబోయిన ఉషారాణి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తానని పేర్కొన్నారు.



స్టడీ మెటీరియల్ పంపిణీ

గీసుగొండ, జనవరి 13: గొర్రెకుంట జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలోని టెన్త్ విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ సెట్లను హెచ్ఎం జ్యోతిర్మయికి వరంగల్‌లోని క్లబ్ కార్యాలయంలో శనివారం అందచేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు మామిడాల రమేష్‌బాబు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలల టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ప్రతినిధులు కుమారస్వామి, రాజయ్య, రాజగోపాల్, వైద్యనాథ్, ఆకుల శ్రీనివాస్ పాల్గొన్నారు.


స్టడీ మెటీరియల్‌ను హెచ్ఎంకు అందచేస్తున్న రమేష్‌బాబు

సమస్యలను పరిష్కరించాలని మంత్రికి వినతి


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాస్

ఖిలావరంగల్, జనవరి 13: శివనగర్‌లోని సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ నాయకుడు శామంతుల శ్రీనివాస్ అటవీ, పర్యాటక, దేవాదాయ శాఖమంత్రి కొండా సురేఖను కోరారు. శనివారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్‌డ్రైయినేజీ కారణంగా రోడ్లు, డ్రైయినేజీలు అధ్వానంగా మారాయని, డివిజన్‌లో విద్యుత్‌దీపాలు సక్రమంగా వెలగడం లేదన్నారు. మిషన్‌భగీరథ పైపుల ద్వారా తాగునీరు సక్రమంగా సరఫరా అవడం లేదని మంత్రి దృష్టికి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు.

విలీన గ్రామాల్లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తాం


వసంతాపూర్‌లో పరిశుభ్రతపై సిబ్బందికి సూచనలు చేస్తున్న కార్పొరేటర్ బాబు

మామునూరు, జనవరి 13 : విలీన గ్రామాల్లో త్వరలోనే అభివృద్ధి పనులను ప్రారంభించనున్నట్లు 17వ డివిజన్ కార్పొరేటర్ గద్దె బాబు వెల్లడించారు. ఖిలావరంగల్ మండలం వసంతాపూర్‌లో శనివారం మునిసిపల్ సిబ్బందితో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. డ్రైయినేజీల్లో చెత్త చెదారం లేకుండా పరిశుభ్రం చేయాలని సిబ్బందికి ఆయన సూచించారు. గ్రామంలో కార్పొరేటర్ తిరుగుతూ రోడ్డుపై చెత్తతోపాటు ఇంటిలోని చెత్తను మునిసిపల్ వాహనంలోనే వేయాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు డివిజన్ కత్తెరపల్లి దామోదర్ గ్రామస్థులు పాల్గొన్నారు.

రామా శ్రీనివాస్ సేవలు మరువలేనివి: ఎర్రబెల్లి


శ్రీనివాస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

వరంగల్ కలెక్టరేట్, జనవరి 13: రామా శ్రీనివాస్ ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శనివారం నాయుడు పంప్ సమీపంలోని సిల్వర్ క్రౌహైస్కూల్‌లో రామా శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దయాకర్‌రావు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి, బీజేపీ నాయకులు కుసుమ సతీష్, వన్నాల వెంకటరమణ, కర్నె రవీందర్, కూచన శ్రీనివాస్, వడిచర్ల ప్రసాద్, చిలువేరు రాజేందర్ తదితరులు ఉన్నారు.

నిరుపయోగంగా చేతిపంపులు

• పలుచోట్ల ప్రమాదకరంగా రోడ్డుపైనే.. • రోడ్డు విస్తరణలో కొన్ని తొలగింపు..
• పట్టించుకోని అధికారులు • ఇబ్బందులు పడుతున్న స్థానికులు

శంభునిపేట, జనవరి 13 : ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన చేతిపంపులు(బోరింగ్)లు నేడు నిరుపయోగంగా మారడంతో స్థానికులు తాగు, ఇంటి అవసరాలకు నీరులేక అల్లాడుతున్నారు. గతంలో వేసిన బోర్లు తర్వాతి కాలంలో రోడ్ల విస్తరణతో కొన్ని నడిరోడ్డుపైకి రాగా, మరికొన్ని తొలగించారు. పలుచోట్ల అసలు బోర్లు పనిచేస్తున్నాయా? లేదా అన్నది పరిశీలించకుండా సంబంధిత కాంట్రాక్టర్లు కొన్నింటిని అలాగే వదిలేసి, మరికొన్నింటిని పూర్తిగా తొలగించి చేతులు దులుపుకున్నారని ఆయా కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. కార్పొరేషన్ కుళాయిల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తోంది. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో చేతిపంపు (బోరింగ్) లు వేశారు. మిషన్ భగీరథ పైపులైన్‌లు తరచూ లీకేజీలతో నీటి సరఫరాలో అంతరాయం కలుగుతోంది. దీంతో కాలనీల్లో అప్పుడప్పుడు నీటి సమస్య ఉత్పన్నమవుతోంది. వేసవిలో ఈ సమస్య తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున చేతిపంపుల మరమ్మతులు, కొత్తవి ఏర్పాటుపై అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

వెంటనే మరమ్మతులు చేపట్టాలి



ఆయా ప్రాంతాలలో పనిచేయని చేతిపంపులను వెంటనే మరమ్మతులు చేపట్టాలి. వేసవిలో నీటి ఎద్దడిని దృష్టిలో పెట్టుకుని నీటి ఎద్దడి కలుగక ముందే పనులు చేపట్టాలి. మిషన్ భగీరథ పైపు లైన్ లీకేజీలతో పలు సందర్భాల్లో నీటి సరఫరా జరగడంలేదు. ప్రత్యామ్నాయంగా బోరింగ్‌లను అందుబాటులో ఉంచి, ప్రజల నీటి సమస్యలకు పరిష్కార మార్గం చూపాలి.

- చిట్టిమల్ల విశ్వకుమార్, రంగశాయిపేట

పలుచోట్ల పనిచేయని చేతి పంపులు..

రంగశాయిపేట గాంధీ విగ్రహం వద్ద ఇటీవల రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టారు. ఇక్కడ ఉపయోగంలో ఉన్న బోరింగ్‌ను పట్టించుకోకుండా చుట్టూ సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో బోరింగ్ భూమిలోకి పోయి నిరుపయోగంగా, ప్రమాదకరంగా మారింది. రోడ్డుపై వాహనదారులకు అడ్డుగాను మిగిలింది. రామాలయం వద్ద ఏళ్లుగా ఉపయోగంలో ఉన్న చేతిపంపు పని చేయడం లేదు. కంచరివాడలో రోడ్డు పక్క బోరింగ్ పనిచేయకుండా ఉండటంతో ఆ ప్రాంతం చెత్త డంపింగ్‌లా మారింది. శంభునిపేట నుంచి నెహ్రూ విగ్రహం వద్దకు వెళ్లే దారిలో రోడ్డుపై బోరింగ్ ఏళ్లుగా నిరుపయోగంగా ఉంది. రోడ్డు పక్కనే ప్రమాదకరంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే, 41వ డివిజన్ విశ్వనాథకాలనీలో బోరింగ్ ఉన్న ప్రాంతం చెత్త డంపింగ్‌గా మారింది. దూపకుంట రోడ్‌లో బోరింగ్ రోడ్డుపైకి వచ్చి ప్రమాదకరంగా రోడ్డుకు అడ్డుగా ఉన్నాయి. నగరంలోని పాత కాలనీల్లో, వాడల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. ఉన్నతాధికారులు స్పందించి బోరింగ్‌లు ఏఏ ప్రాంతాలలో అవసరం ఉంది, ఏఏ ప్రాంతాలలో నిరుపయోగంలో ఉన్నాయో గుర్తించి వాటికి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే ప్రమాదకరంగా ఉన్న వాటితోపాటు అవసరం లేని బోరింగ్‌లను పూర్తిగా తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


రంగశాయిపేట గాంధీ విగ్రహం వద్ద రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న బోరింగ్


రామాలయం వద్ద నిరుపయోగంగా మారిన బోరింగ్

సంప్రదాయాలను గౌరవించాలి

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

మామునూరు, జనవరి 13 : సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించి, భావితరాలకు వాటి గురించి తెలియజేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. 43వ డివిజన్ లక్ష్మీపురంలో సంక్రాంతి పండుగ సందర్భంగా శనివారం కైట్ ఫెస్టివల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు ఘనంగా జరుపుకునే సంక్రాంతి పండుగను భవిష్యత్తు తరాలకు అందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారన్నారు.

లక్ష్మీపురంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను పార్టీలకు అతీతంగా పేదలకు అందజేస్తామన్నారు. తిమ్మాపురం, అల్లీపురం, లక్ష్మీపురం, పెన్షన్‌పూర్‌లలోని శ్మశాన వాటికల అభివృద్ధి పనులను పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. టీఎస్ఎస్‌పీ ఫోర్త్ బెటాలియన్ రిటైర్డ్ పోలీసు అధికారులు అసోసియేషన్ ఆధ్వర్యంలో రిటైర్డ్ పోలీసులు ఎమ్మెల్యే నాగరాజును సత్కరించారు. కార్యక్రమంలో మామునూరు సీఐ క్రాంతికుమార్, రిటైర్డ్ పోలీసు అధికారుల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఇనుగాల జోగిరెడ్డి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నక్క కొమురెల్లి, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్, ప్రధాన కార్యదర్శి జఫర్ బాబా, మాజీ ఎంపీటీసీ, 43వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చింత ప్రకాశ్, కత్తి సమ్మయ్య, దశరథం తదితరులు పాల్గొన్నారు.



కైట్ ఫెస్టివల్‌ను ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు

అయ్యప్ప స్వాములకు ఇరుముడి

సంగెం, జనవరి 13: అయ్యప్ప మాలధారులు 41 రోజులు కఠోర దీక్ష చేసి శనివారం గవిచర్లలో గురుస్వామి కొంతం యాదగిరి స్వామి ఇరుముడిలను వేశారు. ఆలయంలో పడిపూజ నిర్వహించిన అయ్యప్ప స్వాములు భక్తి గీతాలను ఆలపించారు. అనంతరం అయ్యప్ప స్వాములతోపాటు వారి కుటుంబ సభ్యులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


గవిచర్ల గ్రామంలో ఇరుముడి వేస్తున్న గురుస్వామి

రైలులోంచి పడి టైల్స్ కార్మికుడి దుర్మరణం

స్వగ్రామం యూపీకి వెళ్తుండగా ప్రమాదం

గిర్మాజిపేట, జనవరి 13 : సంక్రాంతి సెలవులు రావడంతో కుటుంబ సభ్యులను చూసేందుకు వెళ్తున్న యూపీకి చెందిన టైల్స్ కార్మికుడు ప్రమాదవశాత్తు రైలులోంచి కిందపడి శనివారం దుర్మరణం చెందాడు. వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలో ఘటన జరగ్గా, వరంగల్ జీఆర్‌పీ సీఐ జి.నరేష్ విలేఖరులకు ఘటనా వివరాలను వెల్లడించారు.

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఆగ్రా బహార్‌వటి నార్లకు చెందిన సౌరబ్ సింగ్ (23) తన గ్రామస్థులతో ఖమ్మం నగరంలో టైల్స్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. సంక్రాంతి పండుగ కారణంగా పనులకు విరామం దొరకడంతో కుటుంబసభ్యులను చూసేందుకు సహచరులతో కలిసి శనివారం ఉదయం తమిళనాడు ఎక్స్‌ప్రెస్ జనరల్ కంపార్టుమెంట్‌లో ఆగ్రాకు బయలుదేరాడు. ఉదయం 8.30గంటల ప్రాంతంలో రైలు వంచనగిరి రైల్వేగేటు వద్ద రాగా, కంపార్టుమెంట్‌లో రద్దీ ఉండటంతో డోర్ వద్ద ఉన్న సౌరబ్‌సింగ్ ప్రమాదవశాత్తు రైలు నుంచి పట్టాలపై పడి పోయాడు. దీన్ని గమనించిన సహచరులు చైన్ లాగి రైలు ఆపి వెనక్కి పరుగెత్తుకుని వచ్చేసరికే పట్టాలపై తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని ఎంజీఎం ఆస్పత్రిలో భద్రపరిచి మృతుని కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చినట్లు సీఐ చెప్పారు.


మృతుడు సౌరబ్ సింగ్

ఉద్యమకారుడు రాఘవులు మృతి



మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచుతున్న నరేందర్

ఖిలావరంగల్, జనవరి 13: తొలి, మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు తీగల రాఘవులు(83) వృద్ధాప్యం, అనారోగ్యంతో బాధపడుతూ శనివారం వరంగల్ ఎంజీఎంలో మృతిచెందారు. రాఘవులు గతంలో ఖిలావరంగల్ పీఏసీఎస్ డైరెక్టర్‌గా, కాంగ్రెస్ సేవాదళ్ నాయకుడుగా, తొలి, మలిదశ తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. ఉద్యమ సమయంలో జైలుకు సైతం వెళ్లాడు. రైల్వేఉద్యోగాన్ని వదులుకుని తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. ఖిలావరంగల్‌చమన్ వద్దగల తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద రాఘవులు భౌతికకాయాన్ని ఉంచి స్థానికులు నివాళులర్పించారు. ఖిలావరంగల్‌కు చెందిన ఆయనకు భార్య రాధమ్మ, ముగ్గురు కుమారులున్నారు. కుమ్మరికుంట శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. రాఘవులు మృతి తెలంగాణ సమాజానికి తీరనిలోటని కార్పొరేటర్ బైరబోయిన ఉమా-దామోదర్‌యాదవ్, తెలంగాణ ఉద్యమకారుడు, అడ్వకేట్ తీగల జీవన్‌లు తదితరులు అన్నారు.

పలువురి పరామర్శ..

సీనియర్ కాంగ్రెస్ నాయకుడు తీగల రాఘవులు మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు బండి కోటేశ్వర్‌రావు, మిట్టపెల్లి కట్టమల్లు, కడారి భోగేశ్వర్, పోశాల సారంగపాణి, బైరబోయిన రవిందర్, తీగల జీవన్, తోటకూరి నర్సయ్య, ఆకుల కుమార స్వామి, బజ్జూరి ప్రసాద్ మృతదేహానికి నివాళులర్పించారు.

వైభవంగా శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణోత్సవం

లింగగిరి గుట్టపై ప్రత్యేక అభిషేక పూజలు

చెన్నారావుపేట, జనవరి 13 : మండలంలోని లింగగిరి గుట్టపై శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో జాతరలో భాగంగా శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో 8 వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా గణపతి పూజ, పుణ్యావాచనం, మహేశ్వర్వాదంలతో పాటు స్వామి వారికి పలు అభిషేక పూజలను నిర్వహించారు. ఆలయంలో అర్చకులు సుదర్శనచార్యులు, రమణ కుమార్‌చారి, శ్రావణ్ కుమార్‌లను వేద మంత్రోచ్ఛరణల మధ్య చెన్నకేశవస్వామి కల్యాణోత్సవ వేడుకలను నిర్వహించారు. దొడ్డ వెంకటేశ్వర్లు దంపతులు కల్యాణోత్స వేడుకల్లో పాల్గొని కల్యాణంను నిర్వహించారు. అనంతరం స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మదారాపు భాస్కర్, ఉప సర్పంచ్ బుర్గు రాజశేఖర్, మల్లం వేణు, సాగర్‌గౌడ్, చీకటిరాజు, గ్రామస్థులు, భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


లింగగిరి గుట్టపై చెన్నకేశవస్వామి కల్యాణం చేస్తున్న అర్చకులు

పండగ శోభ

5వ పేజీ తరువాయి)

సంక్రాంతి వచ్చిందంటే చాలు పూజా సామగ్రి, రంగులు, ఇతర కొనుగోళ్లను వరంగలోని ప్రధాన వీధులన్నీ కిటకిటలాడాయి. నోము సామానుల అమ్మకాలతో నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక దుకాణాలు వెలిశాయి. రంగులు, ఆవుపేడ, నవధాన్యాలు, గరక, పిండి గరక, రేగుపండ్లు, పువ్వుల అమ్మకాలు జోరుగా సాగాయి.

పిండి వంటల ఘుమఘుమలు

సంక్రాంతి వేళ ప్రతీ ఇంటా పిండి వంటలను తయారు చేస్తారు. పండుగకు బంధుమిత్రులను, కూతుళ్ల, అల్లుళ్లను పిలుచుకొని వేడుక చేసుకుంటారు. పిండి వంటలతో ఇళ్లన్నీ ఘుమఘుమలాడుతున్నాయి. సకినాలు, అరిసెలు, మడుగూలు, కారబిళ్లలు, గరిజెలు, లడ్డూలతో పిండి వంటలు ఇంటింటా చేస్తున్నారు. పిండి వంటలు చేసుకోలేని వారి కోసం ప్రత్యేక పిండి వంటల దుకాణాలు వెలిశాయి. కొనుగోలుదారులతో షాపులు కిటకిటలాడుతున్నాయి.

పండుగకు సొంతూళ్లకు..

సంక్రాంతి మూడు రోజుల పండగ. మూడు రోజులు సెలవులు రావడంతో దూర ప్రాంతాల్లో ఉన్నవారు సొంతిళ్లకు చేరుకున్నారు. హైదరాబాద్, బెంగుళూర్, మైసూర్, పూణే, చెన్నై, వైజాక్ ప్రాంతాల నుంచి గ్రామీణ ప్రాంతాలకు చేరుకుంటున్నారు. దీంతో వరంగల్ బస్టాండ్, రైల్వే స్టేషన్‌లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి.

అయోధ్య రామయ్య అక్షింతల పంపిణీ


ఎన్‌టీఆర్ నగర్‌లో అక్షింతలు పంపిణీ చేసేందుకు బయలుదేరిన యువసేన యూత్ సభ్యులు

కరీమాబాద్, జనవరి13: అండర్ రైల్వేగేటు ప్రాంతంలోని 33, 39వ డివిజన్లలో సేవా బస్తీ (దళిత బస్తీ)లో శనివారం అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముని పూజిత అక్షింతల పంపిణీ నిర్వహించారు. వన్నాల వెంకట రమణ ఆధ్వర్యంలో 200 మంది కుటుంబాలకు వీటిని అందజేశారు. అనంతరం వెంకటరమణ మాట్లాడుతూ అయోధ్య రామ మందిర నిర్మాణానికి ఎందరో ప్రాణత్యాగం చేశారన్నారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా అయోధ్యలో శ్రీరామ భవ్య మందిర నిర్మాణాన్ని చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. 22న అయోధ్యలో భవ్య రామ మందిరం ప్రాణ ప్రతిష్ఠ జరగనుందని, ప్రతీ ఒక్కరు ఆ రోజున తమ తమ గృహాల్లో జ్యోతులు వెలిగించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాదాసు రాజు, మాచర్ల రవీందర్, చిలువేరు రాజేందర్, సాయి, గోవింద సింగ్, వెంకటేశ్వర్లు, శ్రీను, శ్యామ్, పద్మ, రమేష్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.


కరీమాబాద్‌లో అక్షింతలను పంపిణీ చేస్తున్న వెంకట రమణ

● వరంగల్‌టౌన్ : నగరంలోని 14వ డివిజన్ ఏనుమాముల ఎన్‌టీఆర్‌నగర్‌లో శనివారం అయోధ్యరాముడి అక్షింతలు పంపిణీ చేశారు. స్థానిక యువసేన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున డప్పు చప్పుళ్లతో ఇంటింటికి తిరుగుతూ పంపిణీ చేశారు. భక్తులు మంగళహారుతులతో స్వాగతం పలికారు. డీజే పాటలతో భక్తులు నృత్యాలు చేశారు. కార్యక్రమంలో యువసేన యూత్ అసోసియేషన్ ప్రతినిధులు, స్థానికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలి

సంగెం, జనవరి 13: ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలని, ఇందుకోసం కార్యకర్తలు శ్రమించాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి సూచించారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆదేశాల మేరకు గ్రామాల్లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారి వివరాలను సేకరించాలన్నారు. గ్రాడ్యుయేషన్ ఎన్నికల మండల కో-ఆర్డినేటర్‌గా ఆకుల రుద్ర ప్రసాద్‌ను నియమించారు. కార్యక్రమంలో పరకాల నియోజకవర్గ గ్రాడ్యుయేషన్ ఎన్నికల మండల కో- ఆర్డినేటర్ మార్క విజయ్‌కుమార్, మండల నాయకులు అచ్చ నాగరాజు, వేంకటేశ్వర్లు, రమేష్, ఆగపాటిరాజు పాల్గొన్నారు.

'పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడి హేయమైన చర్య'

పోచమ్మమైదాన్, జనవరి 13: తల దాచుకోవడానికి శరణమిచ్చిన పాలస్తీనా దేశంపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులు హేయమైన చర్యని ఇస్లామిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఎస్ఐవో) జిల్లా అధ్యక్షుడు ఫహీముద్దీన్ అన్నారు. పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులను ఖండిస్తూ శనివారం పోచమ్మమైదాన్ చౌరస్తాలో ఎస్ఐవో ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలస్తీనాలో చిన్నారులు, వృద్ధులు, మహిళలు మరణించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఇజ్రాయెల్‌ను అన్ని దేశాలు వ్యతిరేకించాలని, పాలస్తీనాకు మద్దతుగా ప్రతీ ఒక్కరు గళం విప్పాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐవో ప్రతినిధులు హంజా అబ్దుల్లాహ్, ముబీన్, మోతిజ్, అఫ్రోజ్ పాల్గొన్నారు.



పోచమ్మమైదాన్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఐవో శ్రేణులు

డాక్టర్ సైఫ్ సస్పెన్షన్ తాత్కాలిక రద్దు

హనుమకొండ అర్బన్, జనవరి 13: అనస్థీసియా విభాగం పీజీ రెండో సంవత్సరం మెడికలో డాక్టర్ సైఫ్ సస్పెన్షన్ తాత్కాలికంగా రద్దు చేసినట్లు కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.మోహన్‌దాస్ తెలిపారు. తెలంగాణ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల మేరకు సస్పెన్షన్‌ను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. డాక్టర్ సైఫ్ వెంటనే తరగతులకు హాజరయ్యే విధంగా ఉత్తర్వులు జారీ చేశారు. హైకోర్టు వీపీ నెంబర్ 900 / 2024 తుది తీర్పుకు డాక్టర్ సైఫ్ కట్టుబడి ఉండాలని షరతులతో తరగతులకు అనుమతించారు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL ఆదివారం 14 జనవరి 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థిని

నర్సంపేట టౌన్, జనవరి 13 : నర్సంపేట ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సంధ్య కూతురు తేజశ్రీ ఈ నెల 18 నుంచి చెన్నైలో జరగనున్న ఖేల్ ఇండియా జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు టీజేఎంయూ నర్సంపేట డిపో సెక్రటరీ గొలన కొండ వేణు శనివారం తెలిపారు. పరకాల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 9వ తరగతి విద్యనభ్యసిస్తున్న తేజశ్రీ ఇటీవల హైదరాబాద్‌లోని సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో ఖేల్ ఇండియా కబడ్డీ పోటీల్లో ములుగు జిల్లా టీం తరుపున పాల్గొని అత్యంత ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి ఎంపికైనట్లు చెప్పారు.

ఈ సందర్భంగా తేజశ్రీను డిపో ఉద్యోగులు అభినందించారు.



తేజశ్రీ

విద్యుత్ తీగలను స్టిన్నింగ్ చేసిన సిబ్బంది

• 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



కొత్తపెల్లిలో విద్యుత్ తీగల సమస్యను రైతు సమక్షంలో పరిష్కరించిన సిబ్బంది

వర్ధన్నపేట రూరల్, జనవరి 13 : మృత్యు పాశాలు..! అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. మండలంలోని కొత్తపెల్లి గ్రామంలో 11 కేవీ వేలాడే తీగలను పట్టించుకోవడం లేదనే వార్త ప్రచురితం కావడంపై వరంగల్ రూరల్ ఎస్ఈ మధుసూదన్, డీఈ భిక్షపతి, ఏడీఈ కన్న రాజులు వెంటనే కాంట్రాక్టర్ లక్ష్మణ్ రావు, సిబ్బంది దుబాసి శ్రీను లను తీగలు సరిచేయాలని ఆదేశించారు. దీంతో శనివారం వ్యవసాయ పొలం నుంచి వేలాడే తీగలను స్టిన్నింగ్ చేసి విద్యుత్ స్తంభాలను సరి చేశారు. బాధిత రైతు దేవరాజు సమక్షంలో సమస్యను పరిష్కరించి ప్రమాదాన్ని నివారించారు. ఆ వెంటనే ఎస్ఈ, డీఈ, ఏడీఈలు సమస్య ఉన్న చోటుకి వెళ్లి పరిశీలించారు.

• **రైతులు సమాచారం అందించాలి..**

ఏడీఈ కన్న రాజు, వర్ధన్నపేట



వర్ధన్నపేట డివిజన్ పరిధిలో ఉన్న రైతులు విద్యుత్‌కు సంబంధించిన సమస్యలను నేరుగా అధికారులకు తెలియచేయాలన్నారు. కొన్ని చోట్ల సమస్య పరిష్కారానికి సమయం పట్టినప్పటికీ శాశ్వతంగా వాటిని మరమ్మతు చేస్తున్నామని తెలిపారు. సిబ్బంది విద్యుత్ పరికరాలను పొలంలోకి తీసుకు వెళ్లేందుకు వీలు కాని చోట కొంత ఆలస్యం అవుతుందని, రైతులు నాటు వేయక ముందే ఎలాంటి సమస్యలు ఉన్న తెలపాలని కోరారు. విద్యుత్ స్తంభాలకు ఏర్పాటుచేసిన సపోర్టు తీగలను తీసివేయవద్దని, దున్నేటప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. అధికారులకు రైతులు సహకరించి సేవలు పొందాలన్నారు.

నేడు నర్సంపేటలో పాడి పశువుల అందాల పోటీలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పోటీల నిర్వాహకులు

నర్సంపేట, జనవరి 13 : నర్సంపేట పట్టణంలోని శాంతిసేన రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక బాలుర హై స్కూల్ ఆవరణలో ఈ నెల 14న సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని పాడి పశువుల అందాల పోటీని నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు చిలువేరు కుమారస్వామి, గౌరవ అధ్యక్షుడు ఎర్ర యాకూబ్‌రెడ్డిలు తెలిపారు. ఈ మేరకు పోటీలకు సంబంధించిన కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని గ్రామాల నుంచి జోడెడ్లు, ఆవు, గేదె, గొర్రెపోతు, శునకం, దూడ, కోడిపుంజుల అందాల పోటీలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో చిలువేరు వెంకటేశ్వర్లు, వెంకన్న, శ్రీనివాస్‌రెడ్డి, కొమ్మాలు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రాముని అక్షింతల వితరణ



దమ్మన్నపేటలో రాముల వారి అక్షింతలను వితరణ

వర్ధన్నపేట రూరల్, జనవరి 13 : మండలంలోని దమ్మన్నపేట, కట్య్రాల గ్రామాల్లో శనివారం వేరువేరుగా అయోధ్య రాముని అక్షింతలను వితరణ చేశారు. శ్రీరామ మందిర్ తీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో వైఎస్ ఎంపీపీ చొప్పరి సోమలక్ష్మీ దమ్మన్నపేటలో పురవీధుల్లో తిరుగుతూ ఇంటింటికి అక్షింతలను అందచేశారు. కట్య్రాలలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు జడ సతీష్ ఆధ్వర్యంలో అక్షింతలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు ఈనెల 22 న అయోధ్య రాముల వారి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఇంటికి ఐదు దీపాలను వెలిగించాలచి ప్రధాని ఉపవాస దీక్షకు మద్దతు తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో మచ్చ సమ్మయ్య, మేరుగు రామచంద్రు, ఉల్లెంగుల యాదగిరి, మేర్గురాజాలు, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంఎంఎస్ ప్రధాన కార్యదర్శిగా వీరప్రకాష్ నియామకం



నియామక పత్రాన్ని అందుకుంటున్న వీరప్రకాష్

నర్సంపేట టౌన్, జనవరి 13 : మాల మహానాడు రాష్ట్ర (ఎంఎంఎస్) ప్రధాన కార్యదర్శిగా దళిత రత్న గుంటి వీరప్రకాష్, ముఖ్య సలహాదారుడిగా ప్రొఫెసర్ డాక్టర్ గద్ద వెంకటేశ్వర్లును నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు పసుల రాంమూర్తి శనివారం ఉత్తర్వులు జారీ చేశా రు. ఈ సందర్భంగా పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాలలో జరిగిన సమావేశం లో రాంమూర్తి మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ఎస్ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా మనకందించిన హక్కులను పొందడానికి ఐక్యంగా ఉద్యమిం చాలని పిలుపునిచ్చారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఎస్సీ రిజర్వేషన్లను పెంచాలని, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈవో గంజి లక్ష్మీనారాయణ, ఉసిల్ల కుమార్, కేదారి, బందెల రామస్వామి, సాంబయ్య, గణేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మండల స్థాయి క్రికెట్ క్రీడలు ప్రారంభం



కీడలను ప్రారంభిస్తున్న డాక్టర్ అనిల్

చెన్నారావుపేట, జనవరి 13 : మండలంలోని ధర్మతండాలో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రికెట్ క్రీడోత్సవాలను శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ బోడ అనిల్‌నాయక్ మాట్లాడుతూ సంక్రాంతి పర్వదినంగా గ్రామాలల్లో నిర్వహించే క్రీడలు స్నేహ భావంను పెంచుతాయన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం వస్తుందన్నారు. యువత చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై పస్తం శ్రీనువాస్, సర్పంచ్ అరుణ వీరాసింగ్, బోడ దేవ్ సింగ్, వాల్సింగ్, వెంకన్న, రవిందర్, వాల్యా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మృతికి కారుకులైన వారిపై చర్యలు తీసుకోవాలి

చెన్నారావుపేట, జనవరి 13 : విద్యార్థి దీప్తి మృతికి కారుకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా కార్యదర్శి జన్ను రమేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థి మృతిపై నిర్లక్ష్యం వహించిన యాజమాన్యంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. దీప్తి కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. విద్యార్థి మృతికి గల కారణాలను పోలీసుల విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు.

విత్తనం, ఎరువులు ఒకేసారి..!

• సీడ్ డ్రిల్ మిషన్‌తో లాభాలు

• సమయం ఆదా, కూలీల సమస్యకు చెక్



ఫెర్టికమ్ సీడ్ డ్రిల్ మిషన్

వర్ధన్నపేట రూరల్, జనవరి 13 : మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయంలో సైతం రైతులకు అందుబాటులో ఎన్నో పరికరాలు వస్తున్నారు. ఈ తరుణంలోనే సీడ్ డ్రిల్ విత్తు మిషన్లు సైతం రైతులకు అందుబాటులోకి వచ్చాయి. ఎక్కువ విస్తీర్ణంలో వ్యవసాయం చేసే వారికి ఈ విధానం మంచి ఫలితాలు ఇస్తుందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఫెర్టికమ్ సీడ్ డ్రిల్లర్లతో విత్తనాలు, ఎరువులు సమపాళ్లలో ఒకేసారి వేసుకోవచ్చు. దీంతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించడంతో పాటు కూలీల సమస్యను అధిగమించవచ్చు.

సమయం ఆదా...

సీడ్ డ్రిల్ పరికరాన్ని ఉపయోగించి వ్యవసాయం చేస్తే రైతులకు సమయం ఆదా అవుతుందని చెపుతున్నారు. విత్తనాలు, ఎరువులు ఒకేసారి వేయడం వలన రైతులకు సమయం కలిసి రావడంతో పాటు కూలీల కొరత కూడా తగ్గుతుంది. విత్తనాలు విత్తి, అవి మొలకెత్తిన తర్వాత కలుపు తీయడం, ఆ తర్వాత సాల్లువేసి మళ్లీ ఎరువులు వేయడం లాంటి సమస్యలు ఉండవు. దీంతో రైతులకు ఖర్చులు తగ్గుతాయని వ్యవసాయ అధికారులు అభిప్రాయపడుతున్నారు. యంత్రం రూ.లక్షకు పైగా ఖర్చవడంతో కొన్ని చోట్ల రైతులు ఆసక్తి చూపడం లేదని చెపుతున్నారు. ఎక్కువ వ్యవసాయం కలిగిన రైతులు తీసుకుంటే మంచి ఫలితాలు పొందవచ్చని చెపుతున్నారు. కానీ ఇవే యంత్రాలను ప్రభుత్వం సబ్సిడీ రూపంలో అందిస్తే బాగుంటుందని రైతులు తీసుకుకోవడానికి ముందుకు వస్తారని చిన్న సన్నకారు రైతులు పేర్కొంటున్నారు.

ఫెర్టికమ్ సీడ్ డ్రిల్ ఉపయోగాలు...

- అన్ని రకాల విత్తనాలు నాటవచ్చు.
- 8గంటల్లో 6-8ఎకరాల్లో విత్తనాలు విత్తుకోవచ్చు.
- వర్షాధార భూముల్లో తేమ తగ్గక ముందే సకాలంలో విత్తనాలు వేసుకొనే అవకాశం ఉంటుంది.
- పంట ఆధారంగా వరుసలు, మొక్కల మధ్య దూరం మార్చుకోవచ్చు.
- విత్తనంతో పాటు ఎరువులు వేయడంతోపటం తొలి దశలో ఆరోగ్యంగా పెరుగుతుంది. వేసిన ఎరువు మొక్కకు మాత్రమే అందడంతో ఎరువుల వినియోగ సామర్థ్యం పెరుగుతుంది. పంటకు గాలి, వెలుతురు బాగా తగిలి ఆరోగ్యంగా పెరుగుతుంది.
- యంత్రాలతో వరి, వేరుశనగ, మొక్కజొన్న, పెసర, మినుము, కొమ్ము శనగ తదితర పంటలు వేసుకోవచ్చు. యంత్రాన్ని వినియోగించే సమయంలో పొలం చదునుగా ఉండాలి.
- చివరి దుక్కిలో రోటోవేటర్ ఉపయోగించాలి.
- పొలం చదునుగా ఉంటే విత్తనం ఎరువులు ఒకే మోతాదులో పడతాయి. ఒకేసారి మొలక శాతం వస్తుంది.

సీడ్ డ్రిల్ పనితీరు...

సీడ్ డ్రిల్ యంత్రంలో రెండు బాక్సులు ఉంటాయి. ముందు బాక్స్‌లో ఎరువులు, రెండో బాక్స్‌లో విత్తనం వేయాలి. ఎరువు ముందు పడుతుంది. తర్వాత విత్తనం పడుతుంది.

పంటల వారీగా దూరం(సెం.మీ.లలో) ఇలా

రకం	వరుసల మధ్య	మొక్కల మధ్య
వరి	25	15
మొక్కజొన్న	60	20
పామాయిల్	60	20
పెసర	25	10
వేరుశనగ	30	15

రైతులకు డెమో చూయించాం..

రాంనర్సయ్య, వర్ధన్నపేట ఏవో



సీడ్ డ్రిల్ మిషన్‌పై రైతులకు డెమో చూయించాం. అధునాతక సాంకేతిక పద్ధతులతో తయారైన మిషన్ రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటుంది. కానీ, ప్రభుత్వ సబ్సిడీ లేకపోవడం వలన ఆసక్తి చూపడం లేదు. ఎక్కువ విస్తీర్ణం కలిగిన రైతులకు మంచి ఫలితాలు ఇస్తుంది.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

• ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

• కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ పార్టీ ఎంపీటీసీ , వార్డు సభ్యులు



సాయిరెడ్డిపలిలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎంపీటీసీ , వార్డు సభ్యులు నాయకులు

నెక్కొండ, జనవరి 13 :పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకుగాను అనేక రకాల సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడంతోపాటు వాటిని విజయవంతంగా అమలు చేస్తుందని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మండలంలోని సాయిరెడ్డిపల్లి గ్రామ బీఆర్ఎస్ నాయకురాలు, ఎంపీటీసీ బండారుపల్లి వినయ్‌కుమార్‌శ్రీనివాస్, వార్డు సభ్యులు బానోతు జాదు, మద్ది నిర్మల, కడదురు సంపత్, వేణు, కుమారస్వామితో పాలు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి ఎమ్మెల్యే శనివారం పార్టీ కండువాలను కప్పి పార్టీలో చేర్చుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలుచేస్తున్న ఆరు గ్యారెంటీ పథకాలతో లబ్ధిపొందేందుకు అర్హులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యకర్తలు ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిలా ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

• **సువర్ణలక్ష్మి దేవాలయం ప్రారంభం**

మండలంలోని అప్పల్‌రావుపేటలో నూతనంగా నిర్మాణం చేసిన సువర్ణలక్ష్మి దేవాలయాన్ని శనివారం ఎమ్మెల్యే మాధవరెడ్డి ప్రారంభించారు.ఎమ్మెల్యే మాధవ రెడ్డికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట టీపీసీసీ మెంబర్ సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, మండలపట్టణ పార్టీ అధ్యక్షుడు బక్కి అశోక్, పెండ్యాల హరిప్రసాద్, ఓబీసీసెల్ జిల్లా ప్రధానకార్యదర్శి రాచకొండ రఘు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి శివ, ఉపాధ్యక్షుడు తిరుమల్, నాయకులు కొమ్మారెడ్డి సుధాకర్‌రెడ్డి, చల్లా శ్రీపాల్‌రెడ్డి, కుసుమ చెన్నకేశవులు, సుబ్బారెడ్డి, ఈదునూరి సాయికృష్ణ, గై లక్ష్మన్ పాల్గొన్నారు.

• **సంక్రాంతికి అద్దం పట్టేవి ముగ్గులు**

సంక్రాంతి పండుగకు అద్దం పట్టేవి ఇంట్లోని రకరకాల పిండి వంటలు, ఇంటి ముగ్గింట వెలిసే రంగురంగుల ముత్యాల ముగ్గులని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మండలంలోని పత్తిపాక గ్రామంలో గ్రామ పంచాయతీ అవరణలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల విజేతకు శనివారం ఎమ్మెల్యే బహుమతులను అందించారు. నిత్యం ఇంటి ముంగిట్లో ముగ్గులువేయడంతో మహిళలు ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లావుడ్యా సరితాతిరుమల్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

• **మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి**

నర్సంపేట : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. పట్టణంలోని మాదన్నపేటరోడ్‌లో సీపీఐ గుడిసెల కాలనీలో భారత జాతీయ మహిళా సమైక్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) జిల్లా అధ్యక్షురాలు పాల కవిత ఆధ్వర్యంలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ సీపీఐ కాలనీలో నివాసం ఏర్పాటు చేసుకొని అనేక రకాల ఇబ్బందులతో జీవితాలు కొనసాగిస్తున్న పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇళ్లు కట్టుకునే ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ముగ్గుల పోటీల్లో 50మంది మహిళలు పాల్గొనగా విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పంజాల రమేష్, అక్కపెల్లి రమేష్, పెండెం రామానంద్, వేముల సాంబయ్యగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



కాట్రపెల్లిలో సర్పంచ్ తండ్రి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రాయపర్తి, జనవరి 13 : మండలంలోని కాట్రపెల్లికి చెందిన సర్పంచ్ బోనగిరి ఎల్లయ్య తండ్రి సోమయ్య, తిర్మలాయపెల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దొంతరబోయిన యాదగిరి తండ్రి యాకయ్యలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా శనివారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బాధిత కుటుంబాలను పరామర్శించారు. అనంతరం తిర్మలాయపెల్లికి చెందిన బండి ఎల్లగౌడ్ అనారోగ్యంతో బాధపడుతుండగా పరామర్శించి ఆయన యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీపీ జీనుగు అనిమిరెడ్డి, జడ్పీటీసీ రంగు కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు మునావత్ నర్సింహ నాయక్, బిల్లా సుధీర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

• చెన్నారావుపేట: మండల కేంద్రానికి చెందిన తాపీ మేస్త్రి రాదారపు సారయ్య(80) అనారోగ్యంతో శనివారం మృతిచెందగా, బాధిత కుటుంబాన్ని పలువురు నాయకులు పరామర్శించారు. మృతదేహంపై పూలమాలవేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ కంది కృష్ణారెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు కందకట్ల సాంబయ్య, తాపీ మేస్త్రి సంఘం మండల అధ్యక్షుడు బండి ఉపేందర్, కాంగ్రెస్ మండల నాయకులు లక్క విజేందర్, మహేష్, లక్క రాజు, సతీష్, అల్లాడి నారయణ, రమేష్, అశోక్ గ్రామ పార్టీ అధ్యక్షుడు నర్సయ్య ఉన్నారు.

• ఖానాపురం : మండలంలోని బుధరావుపేటకు చెందిన ఫొటోగ్రాఫర్ కందుల నరేష్ తల్లి రమణమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కాగా, శనివారం మండల ఫొటోగ్రాఫర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఒక క్వింటా బియ్యం అందజేశారు. పరామర్శించిన వారిలో మండల ఫొటోగ్రాఫర్స్ యూనియన్ అధ్యక్షుడు బయ్య శ్యామ్, ప్రధాన కార్యదర్శి కళ్లెపు రాజు, కోశాధికారి తూడి కోటేశ్వర్‌రావు, గౌరవ అధ్యక్షుడు తడుగుల స్వామి, ఫొటోగ్రాఫర్లు ఉన్నారు.

చలో ఢిల్లీని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న పిడమర్తి రవి

వర్ధన్నపేట, జనవరి 13: ఫిబ్రవరి 2, 3వ తేదీల్లో నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పిడమర్తి రవి పిలుపునిచ్చారు. శనివారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగలకు 12శాతం రిజర్వేషన్ ఇవ్వాలని, చట్టసభల్లో మాదిగలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలకు అధిక ప్రధాన్యం కల్పించడంతోపాటు ఒక జనరల్ స్థానంలో అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.వీరేందర్, బరిగెల బాబు, మైస ఉపేందర్, రవీందర్ మాదిగ, కె.యాకయ్య, యాదాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఆవేదన చెందుతున్న కౌన్సిలర్లు

వర్ధన్నపేట, జనవరి 13: వర్ధన్నపేట మునిసిపాలిటీలో గత నాలుగు సంవత్సరాలుగా జరిగిన అనేక అవినీతి అక్రమాలపై పార్టీలకు అతీతంగా మునిసిపాలిటీ వేదికగా జరుగుతున్న పరిణామాలు తమను అవమానాలకు గురి చేస్తున్నాయని కౌన్సిలర్లు సుధీర్, అనిత, స్వేత, పద్మ సంయుక్త ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలపై కౌన్సిలర్లుగా ఉన్నది లేనిది వర్ధన్నపేట ప్రజలకు తెలుసునని, అవిశ్వాసం పేరు తో ప్రజల మధ్య చిచ్చుపెట్టే విధంగా మాట్లాడటం సరికాదని అన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



భవన నిర్మాణ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్సై

చెన్నారావుపేట, జనవరి 13 : మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం ఎస్సై పస్తం శ్రీనువాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులందరూ ఐక్యంగా ఉండి, నూతన ఆశయాల సాధన దిశగా సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో భవన కార్మిక సంఘ మండల అధ్యక్షుడు బండి ఉపేందర్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అమీరుద్దీన్, కోశాధికారి ఎదురబోయిన వీరేంద్రనాథ్, సీఐటీయూ అధ్యక్షుడు అల్లాడి నారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో సంక్రాంతి సంబరాలు



చిన్నారులను అభినందిస్తున్న దృశ్యం

వర్ధన్నపేట, జనవరి 13 : ఆల్ఫోర్స్ ఇ టెక్నో స్కూల్‌లో సంక్రాంతి సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి పండగ పల్లెల్లో సంస్కృతి, సంప్రదాయాలను దృష్టిలో పెట్టుకొని వైభవోపేతం సోదర భావం, ప్రేమానురాగాలతో నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు.చిన్నారులు సాంప్రదాయంగా దుస్తులు ధరించి అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర కల్యాణం



వేంకటేశ్వరస్వామి కళ్యాణంలో పాల్గొన్న భక్తులు

రాయపర్తి, జనవరి 13 : మండలంలోని పెర్కవేడులో దొనబండ శ్రీవేంకటేశ్వర స్వామి భూనీల (భూదేవి) కల్యాణం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చారణాల నడుమ మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. స్థానికులు భారీ సంఖ్యలో చేరుకుని పూజా కార్యక్రమాలు చేశారు. ఈ సందర్భంగా సుదర్శణ హోమం చేసి తీర్థ ప్రసాదాలు అందించారు.

కేశవపురంలో వాలీబాల్ పోటీలు

రాయపర్తి, జనవరి 13 : మండలంలోని కేశవపురంలో శనివారం అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామస్థాయి వాలీబాల్ పోటీలను రాయపర్తి ఎస్సై విజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించి తమ ప్రతిభను చాటుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు చిలుముల్ల కృష్ణ, గుజె సుధాకర్, పున్నమయ్య పాల్గొన్నారు.

పొదుపును అలవాటు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న నరేష్

చెన్నారావుపేట, జనవరి 13 : ప్రతీ ఒక్కరూ పొదుపు చేయడాన్ని అలవాటు చేసుకోవాలని సంఘం అధ్యక్షుడు జన్ను నరేష్ అన్నారు. శనివారం మండలంలోని అమీనాబాద్ గ్రామంలో సూర్యోదయ శ్రమ శక్తి పొదుపు సంఘం 15 వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2009 లో పొదుపు చేయాలనే ఉద్దేశ్యంతో సంఘం ప్రారంభించడం జరిగిందన్నారు. అనాతి కాలంలోనే పొదుపు సంఘం అభివృద్ధి దిశగా పయనించిదన్నారు. ఒకరిపై ఆధారపడకుండా సంఘంలోని డబ్బులను టర్నవర్ చేయాలనే లక్ష్యంగా సంఘం పని చేస్తుందన్నారు. ప్రస్తుతం రూ.15 లక్షల ఆర్థిక లాభాలతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఐతా రాంమోహన్, ఆడిటర్ జన్ను స్వామి, కసుగుల రాజు, సౌర రమేష్, రాములు, కుమార్, రఘు, సందీప్, మహేష్, సూరయ్య, తిరుపతి, అశోక్, సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణోత్సవం

• లింగగిరి గుట్టపై ప్రత్యేక అభిషేక పూజలు



చెన్నకేశవస్వామి కల్యాణం చేస్తున్న అర్చకులు

చెన్నారావుపేట, జనవరి 13 : మండలంలోని లింగగిరి గుట్టపై లక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణోత్సవం వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో జాతరలో భాగంగా లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో 8వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా గణపతి పూజ, పుణ్యావాచనం, మహేశ్వర్వాదంలతో పాటు స్వామి వారికి పలు అభిషేక పూజలను నిర్వహించారు. ఆలయంలో అర్చకులు సుదర్శనచార్యులు, రమణ కుమార్‌చారి, శ్రావణ్ కుమార్‌లను వేద మంత్రోచ్చరణల మధ్య చెన్నకేశవస్వామి కల్యాణోత్సవ వేడుకలను నిర్వహించారు. దొడ్డ వెంకటేశ్వర్లు దంపతులు కల్యాణోత్స వేడుకల్లో పాల్గొని కల్యాణంను నిర్వహించారు. అనంతరం స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మదారాపు భాస్కర్, ఉప సర్పంచ్ బూర్గు రాజశేఖర్, మల్లం వేణు,సాగర్‌గౌడ్, చీకటి రాజు, గ్రామస్థులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి కబడ్డీ విజేత రుద్రగూడెం



కబడ్డీ విజేత రుద్రగూడెం టీం క్రీడాకారులతో నాయకులు

నల్లబెల్లి, జనవరి 13 : ఎంసీపీఐ (యూ) పార్టీ ఆధ్వర్యంలో అమరవీరుల స్మారక మండల స్థాయి క్రీడోత్సావాలను నిర్వహించారు. ఈ మండల స్థాయి క్రీడలు చాలా ఉత్సాహంగా రెండు రోజుల నుంచి జరుగుతున్నాయని మండల పార్టీ అధ్యక్షుడు దామ సాంబయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శనివారం మండల కేంద్రంలో జరిగిన కబడ్డీ పోటీల్లో గొల్లపల్లి కబడ్డీ టీంపై రుద్రగూడెం కబడ్డీ క్రీడాకారులు అద్భుతంగా ఆడి గెలుపొంది ప్రథమ విజేతగా నిలిచారన్నారు. ఈ నెల 14న మండల క్రేందంలోని క్రీడా ప్రాంగణం ఆవరణలో వ్యాస రచనతోపాటు ముగ్గుల పోటీలు కూడా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సట్ల శ్రీనివాస్, గుమ్మడి వేణు, పరికి కోర్నెల్, బొట్ల ప్రతాప్, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పండగ శోభ

(5వ పేజీ తరువాయి)

సంక్రాంతి వచ్చిందంటేచాలు పూజా సామగ్రి, రంగులు, ఇతర కొనుగోళ్లను వరంగలోని ప్రధాన వీధులన్నీ కిటకిటలాడాయి. నోము సామానుల అమ్మకాలతో నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక దుకాణాలు వెలిశాయి. రంగులు, ఆవు పేడ, నవధాన్యాలు, గరక, పిండి గరక, రేగు పండ్లు, పువ్వుల అమ్మకాలు జోరుగా సాగాయి.

• **పిండి వంటల ఘుమఘుమలు**

సంక్రాంతి వేళ ప్రతీ ఇంటా పిండి వంటలను తయారు చేస్తారు. పండుగకు బంధుమిత్రులను, కూతుళ్లు, అల్లుళ్లను పిలుచుకొని వేడుక చేసుకుంటారు. పిండి వంటలతో ఇళ్లన్నీ ఘుమఘుమలాడుతున్నాయి. సకినాలు, అరిసెలు, మడుగూలు, కారబిళ్లలు, గరిజెలు, లడ్డూలతో పిండి వంటలు ఇంటింటా చేస్తున్నారు. పిండి వంటలు చేసుకోలేని వారి కోసం ప్రత్యేక పిండి వంటల దుకాణాలు వెలిశాయి. కొనుగోలుదారులతో షాపులు కిటకిటలాడుతున్నాయి.

• **పండుగకు సొంతూళ్లకు..**

సంక్రాంతి మూడు రోజుల పండగ మూడు రోజులు సెలవులు రావడంతో దూర ప్రాంతాల్లో ఉన్నవారు సొంతిళ్లకు చేరుకున్నారు. హైదరాబాద్, బెంగుళూర్, షైసూర్, పూణే, చెన్నై, వైజాక్ ప్రాంతాల నుంచి గ్రామీణ ప్రాంతాలకు చేరుకుంటున్నారు. దీంతో వరంగల్ బస్టాండ్, రైల్వే స్టేషన్లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి.

డాక్టర్ సైఫ్ సస్పెన్షన్ తాత్కాలిక రద్దు

హనుమకొండ అర్బన్, జనవరి 13 :అనస్థీసియా విభాగం పీజీ రెండో సంవత్సరం మెడికో డాక్టర్ సైఫ్ సస్పెన్షన్ తాత్కాలికంగా రద్దు చేసినట్లు కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.మోహన్‌దాస్ తెలిపారు. తెలంగాణ హై కోర్టు మధ్యంతర ఉత్తర్వుల మేరకు సస్పెన్షన్‌ను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. డాక్టర్ సైఫ్ వెంటనే తరగతులకు హాజరయ్యే విధంగా ఉత్తర్వులు జారీ చేశారు. హైకోర్టు వీపీ నెంబర్ 900 / 2024 తుది తీర్పుకు డాక్టర్ సైఫ్ కట్టుబడి ఉండాలని షరతులతో తరగతులకు అనుమతించారు.